జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, [illegible] ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | సంపుటి : 17 | సంచిక : 287 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పర్యాటకంలో అవకాశాలు

# అపారం

### పర్యాటకాభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయండి

- పెట్టుబడులకు ఇదే సరైన సమయం
- పురాతన కోటలకు సరికొత్త శోభ
- తిరుపతి, విశాఖ, అమరావతి, శ్రీశైలం, రాజమహేంద్రవరంలో టూరిజం హబ్స్ ఏర్పాటు
- సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు



**అమరావతి**

రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని పర్యాటకాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పర్యాటక రంగ సమీక్షా సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తో పాటు ఉన్నతాధికారులు, అధికారులు హాజరయ్యారు. పర్యాటక రంగ అభివృద్ధికి శాఖ తరపున విస్తృత ప్రచారం కల్పించి రానున్న ఐదేళ్లలో 20 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా, భారీ సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం ఆదాయ వనరే కాదని రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే ప్రధాన వేదిక అని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన అన్ని సూచనలను త్వరలోనే ఆచరణలో పెడతామని, సరికొత్త ఆంధ్రప్రదేశ్ కు బాటలు వేస్తామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన పలు అంశాలను, సూచనలను, నిర్ణయాలను మంత్రి కందుల దుర్గేష్ వివరిస్తూ ఏమన్నారంటే... తిరుపతి, విశాఖ, అమరావతి, శ్రీశైలం, రాజమహేంద్రవరంలో టూరిజం హబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీశైలంను మెగా ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి స్థానికంగా ఉన్న సమూహాలను భాగస్వామ్యులుగా చేసి సమీపంలోని డ్యామ్, అటవీ ప్రాంతం, టైగర్ సఫారి లను కలుపుతూ సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ లను నియమించుకోవాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన హోటల్స్, శుభ్రంగా ఉండేలా నిర్వహణ, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో సైతం ఇన్వెస్టర్స్ సమ్మిట్ లు నిర్వహించాలని సీఎం తెలిపినట్లు మంత్రి వివరించారు. - మిగతా3లో



## డీజీపీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు..

## కానీ వచ్చాక కలవలేదు

- వల్లభనేని వంశీని ఎందుకు అరెస్టు చేశారో అర్థం కావడం లేదు
- వల్లభనేని వంశీ అరెస్టుపై వినతిపత్రం ఇచ్చేందుకు డీజీపీ కార్యాలయానికి వచ్చామన్న అంబటి
- కుట్రపూరితంగా, అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపణ
- వంశీని కలిసేందుకు భార్య వచ్చినా ఆంక్షలు పెట్టారని ఆవేదన

**మంగళగిరి**

వల్లభనేని వంశీని అక్రమంగా అరెస్ట్ చేశారని, ఇది కూటమి ప్రభుత్వం కుట్రపూరిత చర్య అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. అసలు వంశీని ఎందుకు అరెస్ట్ చేశారో సరైన కారణం చెప్పలేదని, ఓ తప్పుడు కేసు పెట్టి వంశీని ఇరికించే ప్రయ త్నం చేస్తున్నారని అంబటి మండిపడ్డారు. వంశీ అరెస్టుపై డీజీపీని కలిసి రిప్రజెంటేషన్ ఇవ్వడానికి వచ్చిన అంబటి మీడియాతో మాట్లాడారు. 'వంశీని అ?క్రమంగా అరెస్ట్ చేశారు.. ఎందుకు అరెస్ట్ చేశారో అర్థం కావడం లేదు. తప్పుడు కేసు పెట్టి ఇరికించారు. వంశీ టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి రావడం వల్ల చంద్రబాబు, లోకేష్‌లు కక్ష గట్టారు. ఎన్నోసార్లు అరెస్ట్ చేయాలిన ప్రయత్నించినా కోర్టుకు వెళ్లి ప్రొటక్షన్ తెచ్చుకున్నాడు వంశీ. ఇది తప్పుడు కేసు అని అందరికీ తెలుసు - మిగతా3లో

# రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ

- 1.40 లక్షల కోళ్లు కాల్చేసేందుకు చర్యలు
- ఎలాంటి ఆందోళన వద్దు
- రేపు రాష్ట్రానికి రానున్న కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీ
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- అలా చేసి చికెన్, గుడ్లు తినొచ్చు.. భయపడాల్సిన పనిలేదు
- ఏపీలో అంతకంతకూ విస్తరిస్తోన్న బర్డ్ ఫ్లూ వైరస్
- ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 50లక్షలకు పైగా కోళ్ల మృతి
- ఏపీలో భారీగా పడిపోయిన చికెన్ ధరలు



**అమరావతి**

ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో దీని తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈ వైరస్ కారణంగా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 50లక్షలకు పైగా కోళ్ల మృతిచెందినట్లు సమాచారం. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం, అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ఏపీలో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. అటు కస్టమర్లు రాకపోవడంతో చికెన్ సెంటర్లు బోసి పోతున్నాయి. ఈ క్రమంలో తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించారు. ఉడికించిన చికెన్, గుడ్లు తింటే ప్రమాదం ఏమీలేదని ఆయన స్పష్టం చేశారు. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియా, కొన్ని పత్రికలు భయాందోళనలు సృష్టిస్తున్నాయని, అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రం, శాస్త్రవేత్తలతో చర్చించామని చెప్పిన మంత్రి.. కోళ్లకు వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటర్ వరకే ఇది పరిమితం అవుతుందని - మిగతా3లో

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

- రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ
- ఇటీవల సీఎం పదవికి బీరెన్‌సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.
- మణిపూర్ అల్లర్లు రెండు జాతుల మధ్య రేగిన వైరం..
- యావత్ ప్రపంచం దృష్టి నిలిపేలా హింసకు మూల కారణమైన కుకీ, మైతేయ్ తెగల మధ్య వైరం



## వల్లభనేని వంశీకి

# బిగుస్తున్న ఉచ్చు

- వల్లభనేని వంశీ అరెస్ట్ కేసులో కొత్త ట్విస్ట్ చోటు
- టీడీపీ కార్యాలయం ధ్వంసం కేసులో ఫిర్యాదు విత్ డ్రా చేసుకున్న సత్యవర్ధన్‌ను వైజాగ్‌లో పోలీసులు పట్టుకున్నారు
- ఇటీవల ఇదే సత్య వర్ధన్ ఫిర్యాదు విత్ డ్రా చేసుకోవడం వెనుక ఎవరున్నారనే అంశంపై పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.



**అమరావతి**

మాజీ ఎంఎల్ఏ వల్లభనేని వంశీ అరెస్ట్ కేసులో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. గన్నవరం టీడీపీ కార్యాలయం ధ్వంసం కేసులో ఫిర్యాదు విత్ డ్రా చేసుకున్న సత్యవర్ధన్‌ను వైజాగ్‌లో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని కొద్దిసేపటి క్రితం విజయవాడకు తీసుకు వచ్చారు. అనంతరం రహస్య ప్రదేశంలో సత్యవర్ధన్‌ను పోలీసులు విచారిస్తున్నారు. అందులోభాగంగా అతడి స్టేట్‌మెంట్‌ను ప్రత్యేక పోలీస్ బృందం రికార్డు చేస్తోంది. ఈ స్టేట్‌మెంట్‌ను సైతం వంశీ రిమాండ్ రిపోర్ట్‌కు పోలీసులు జత చేయనున్నారు. అలాగే ఇటీవల ఇదే సత్య వర్ధన్ ఫిర్యాదు విత్ డ్రా - మిగతా3లో



## సరిహద్దుల్లో మరోసారి రెచ్చిపోయిన పాక్ సైన్యం

- తగిన శాస్తి చేసిన భారత్..
- ఎల్ ఓసి వద్ద బుధవారం సాయంత్రం పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణ ఉల్లంఘన
- రౌండ్లు కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో.. అందుకు ధీటుగా బదులిచ్చిన భారత బలగాలు
- మన దేశ సైన్యం శత్రువుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టంతో కాల్పులు ఆపిన దాయాది సైన్యం

# డీజీపీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు.. కానీ వచ్చాక కలవలేదు'

-మొదటిపేజీ తరువాయి

కనీసం వంశీని భార్య కలవడానికి కూడా ఎన్నో ఆంక్షలు పెట్టారు పోలీసులు. తమ పార్టీ నేత వల్లభనేని వంశీని ఎందుకు అరెస్ట్ చేశారో అర్థం కావడం లేదని, దీనిపై దిగ్భ్రాంతికి గురయ్యామని వైసీపీ నేత అంబటి రాంబాబు అన్నారు. వల్లభనేని వంశీ ఒకటి రెండు కేసుల్లో ముద్దాయిగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా ముద్దాయిగా ఉన్నారని తెలిపారు. ఆ కేసులో ఆయన కోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేసే అవకాశం లేదని భావించామని ఆయన పేర్కొన్నారు.

వల్లభనేని వంశీ అరెస్టుపై వినతిపత్రం ఇచ్చేందుకు డీజీపీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడారు. వంశీని ఎందుకు అరెస్టు చేశారో సరైన కారణం చెప్పలేదని అన్నారు. కుట్రపూరితంగా, అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. తప్పుడు కేసు పెట్టి ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వంశీ టీడీపీ నుండి



వైసీపీలోకి రావడంతో చంద్రబాబు, లోకేశ్ కక్ష కట్టారని ఆరోపించారు. ఇది తప్పుడు కేసు అని అందరికీ అర్థమవుతోందని అన్నారు.

వంశీని కలిసేందుకు ఆయన భార్య వచ్చినా అనేక ఆంక్షలు పెట్టారని ఆరోపించారు. దీనిపై డీజీపీకి వినతిపత్రం ఇచ్చేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నామని, కానీ తాము వచ్చాక ఆయన కార్యాలయం నుండి వెళ్లిపోయారని అన్నారు. తమ వినతి పత్రాన్ని ఎవరూ తీసుకోలేదని ఆరోపించారు. వినతి పత్రం తీసుకోకపోవడమేమిటో అర్థం కావడం లేదని వాపోయారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత డీజీపీపై ఉందని ఆయన అన్నారు. తమ వినతి పత్రాన్ని తీసుకోవడానికి ఎవరైనా వస్తారా? లేక తామే మళ్లీ వచ్చి కలవాలా? అనే విషయం తెలియాల్సి ఉందని అన్నారు.

దీనిపై డీజీపీకి రిప్రజెంటేషన్ ఇవ్వడానికి అపాయింట్‌మెంట్ తీసుకున్నాం. డీజీపీ ఆఫీస్ కు అపాయింట్ మెంట్ ఇస్తే వచ్చాం.. అయినా వారిని కలవలేదు. రిప్రజెంటేషన్ఇవ్వడానికి గురువారం సాయంత్రం 4.35కి అపాయింట్ మెంట్ ఇచ్చారు. మేము 4.30కే డీజీపీ ఆఫీస్ కి వచ్చాం. అప్పుడు డీజీపీ ఉన్నారు.. కానీ కాసేపటికి వెళ్లిపోయారని చెప్పారు. మరి మా రిప్రంజటేషన్ ఎవ్వరూ తీసుకోలేదు. ఇదేంటో అర్థం కావడం లేదు. శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత డీజీపీపై ఉంది. మేము ఇచ్చే రిప్రజెంటేషన్ తీసుకోవడానికి డీజీపీ ఎవరినైనా పంపిస్తారా? లేక మేమే మళ్లీ వచ్చి కలవాలా? అని అంబటి మీడియా ముఖంగా ప్రశ్నించారు.

# రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ

-మొదటిపేజీ తరువాయి

చెప్పినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

బర్డ్ ఫ్లూ పై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బర్డ్ ఫ్లూ నియంత్రణకు పటిష్టమైన చర్యలను తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ సమస్య పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ పశుసంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీతో పాటు బోపాల్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యురిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబ్ శాస్త్రవేత్తలతో కూడా చర్చించారన్నారు. కేంద్ర నుండి ఇప్పటికే పలు బృందాలు రాష్ట్రానికి వచ్చాయని, కేంద్ర ప్రభుత్వ పశుసంవర్థక శాఖ జాయింట్ సెక్రటరీ కూడా శుక్రవారం రాష్ట్రానికి రానున్నారని ఆయన తెలిపారు.

బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎటు వంటి భయం లేకుండా బాగా ఉడికించిన గ్రడ్లను, మాంసాన్ని నిరభ్యంతరంగా తినవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో పలు మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు వార్తలు, సమాచారం వల్ల ప్రజలు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రజలు బయాందోళనలకు గురయ్యేలా బర్డ్ ఫ్లూ పై తప్పుడు వార్తలు, సమాచారాన్ని వ్యాప్తి చేసేవారి పై కఠిన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు, కానూరు, కృష్ణా జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని ఐదు ఫౌల్ట్రీల్లో ఈ వ్యాధి



సోకినట్లుగా గుర్తించి ఆయా ప్రాంతాలను బయో సెక్యురిటీ జోన్లుగా ప్రకటించి, అధికారులను, సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించి వ్యాధి వ్యాప్తిని నియంత్రించేం దుకు పటిష్టమైన చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ బర్డ్ ఫ్లూ వ్యాప్తి నియంత్రణకై కేంద్ర ప్రభుత్వం కూడా మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిలో రాకపోకలను, దాణా రవాణాను నియంత్రిస్తున్నా మని, ఒక ఫౌల్ట్రీ కూడా లేకుండా చూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకటి నుండి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ముందస్తు జాగ్రత్తలను కూడా తీసుకుంటున్నామని మరియు ఈ పరిధికి బయటనున్న ప్రాంతాల్లో ఎటు వంటి ప్రభావం ఉండదని మంత్రి తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఈ వ్యాధి సోకిన దాఖలాలు ఇప్పటి వరకూ ఏమీ కనిపించలేదని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, పశు సంవర్థక శాఖ, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. రాష్ట్ర పశు సంవర్థక శాఖ సంచాలకులు డా.టి.దామోదర నాయుడు మాట్లాడుతూ సైబీరియన్ వలస పక్షులు రెట్టల వల్ల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందన్నారు. ఆయా ప్రాంతాలను రెడ్ జోన్ లుగా ప్రకటించి వ్యాధి నియంత్రణా చర్యలను తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఇప్పటి వరకూ 14 వేల కోళ్లను కాల్చేయడంతో పాటు 340 గ్రడ్లను నాశనం చేయడం జరిగిందన్నారు. మరో రెండు మూడు ఫౌల్ట్రీలో 1.40 లక్షల కోళ్ల వరకూ ఉన్నాయని, వాటిని కూడా కాల్చేసే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

# రజనీ ఫ్రస్టేషన్ పీక్స్...

**గుంటూరు :** మాజీ మంత్రి విడదల రజనీ విపరీతమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. జగన్ కేబినెట్‌లో మినిస్టర్‌గా ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ పరుష పదజాలం వాడని ఆమె ఇటీవల సవాళ్లు విసురుతూ.. తన రాజకీయ గురువు ప్రత్తిపాటి పుల్లారావుని టార్గెట్ చేస్తుండటం అభద్రతాభావంతోనే అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. వైసీపీ హయాంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆమె ఓటమి తర్వాత పార్టీ మారడానికి ప్రయత్నించారన్న ప్రచారం జరిగింది. అయితే అది సాధ్యపడక పోవడంతో ఇప్పుడు కేసుల భయంతో సవాళ్ల పర్వానికి తెర లేపుతున్నారంటున్నారు. అసలు ఆమెలోని కొత్త కోణంపై జరుగుతున్న చర్చేంటి.తనపై కేసు నమోదు అవ్వగానే మాజీ మంత్రి విడదల రజనీ వాయిస్ సడన్‌గా మారిపోయింది. మునుపెన్నడూ లేని విధంగా తెగ ఆవేశపడిపోతున్నారామె.. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి టీడీపీ టికెట్ ఆశించిన ఆమె.. అది దక్కక పోవడంతో వైసీపీ బాట పట్టారు. అప్పటికే చిలకలూరిపేటలో టీడీపీ నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చక్రం తిప్పుతున్నారు. రజినీని టీడీపీలోకి తీసుకొచ్చి ప్రోత్సహించింది ఆయనే.. అలాంటి రాజకీయ గురువుపై తిరుగుబాటు చేసిన రజినీ వైసీపీ నుంచి పోటీ చేసి ప్రత్తిపాటి పుల్లారావు లాంటి దిగ్గజాన్ని ఓడించడం అప్పట్లో పెద్ద సంచలనం రేపింది..మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన రజినీకి మంత్రివర్గ విస్తరణలో జగన్ కేబినెట్ బెర్త్ ఇచ్చారు. మంత్రిగా పని చేసినప్పుడు కూడా రజినీ ఏనాడు ప్రత్యర్థులపై పరుష పదజాలంతో విరుచుకు పడలేదు. అయితే ఆమె తన పీఏ, కుటుంబ సభ్యులతో కలిసి అవినీతికి పాల్పడి పెద్దఎత్తున కూడపెట్టుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత వివిధ ఆరోపణలకు సంబంధించి ఆమె నగదు తిరిగి చెల్లించి సెటిల్‌మెంట్లు చేసుకున్నారంట. ఆ క్రమంలో చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో రజినిపై.. ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. టీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2019 లో సీఐగా ఉన్న సూర్యనారాయణతో పాటు, రజిని పీఏలు నాగఫణీంద్ర, రామకృష్ణపై కూడా కేసు నమోదు చేశారు.తనపై కేసుల నమోదు కావడానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కారణమని భావిస్తున్న రజినీ.. ఓ రేంజ్‌లో చెలరేగి పోయారు. టైమ్ వచ్చినప్పుడు అందరి లెక్కలూ తేలుస్తానని ఆమె అన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు తాను? చిలకలూరిపేట వదలి వెళ్లానని.. అంతే తప్ప.. నియోజకవర్గాన్ని వీడే ప్రసక్తే లేదన్నారు మాజీమంత్రి. 30 ఏళ్ల పాటు తాను అక్కడే ఉంటానంటూ ఘాటుగానే స్పందించారు. అందరికీ ఫ్యామిలీలు ఉన్నాయనే విషయాన్ని పుల్లారావు గుర్తు పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు రజినీ. రాజకీయాల నుంచి రిటైర్ అయిపోయినా.. వారిని వదలనంటూ వార్నింగ్ కూడా ఇచ్చేశారు. దానిపై ప్రత్తిపాటి కూడా ధీటుగానే స్పందించారరజినీ ఆ స్థాయిలో సవాలు విసరడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌గా మారింది. మునుపెన్నడూ లేని విధంగా రజినీ అలా చెలరేగిపోవడంపై వైసీపీ నేతలు కూడా ఆశ్చర్యపోతున్నారంట.. గత ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం కాకుండా.. రజినీని గుంటూరు నుంచిపోటీ చేయించారు జగన్. అభ్యర్థుల అందరిపైనా సర్వేలు చేయించిన వైసీపీ అధినేత.. రాష్ట్రవ్యాప్తంగా పలువురి స్థానాలను మార్చేశారు. రజినీ చిలకలూరిపేటలో గెలవడం అసాధ్యమని సర్వేల్లో తేలడంతో ఆమెను గంటూరు వెస్ట్‌కి మార్చినా ఆమె గట్టెక్క లకపోయారు.రజిని మంత్రిగా ఉన్న టైమ్‌లో మైనింగ్, ఇసుక తరలింపులో దందాలు నడిచారన్న ఆరోపణలున్నాయి. తన పీఏల సాయంతో క్రషర్ యాజమానులను బెదిరించారని.. పెట్రోలు బంకులను కూడా ఆమె లాక్కున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దాంతో పాటు నాడు తెలుగుదేశం నేతలపై కేసులు పెట్టించారని.. తద్వారా ఎంతోమంది కార్యకర్తలు కూడా ఇబ్బంది పడ్డారని.. టీడీపీ ఆరోపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చాలామందిపై కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో రజినీపైనా కేసు పెట్టడంతో ఆమె తీవ్ర ఆగ్రహానికి గురయ్యారనే టాక్ నడుస్తోంది.30ఏళ్లు చిలకలూరిపేటలోనే రాజకీయం చేస్తానని.. ప్రత్తిపాటి పుల్లారావు ఎక్కడున్నా వదిలేది లేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. రజినీ ఆ స్థాయిలో ఫైర్ అవ్వడానికి భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారడమే కారణమంటున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కొంత కాలం సైలెంట్‌గా ఉన్న విడదల రజినీ.. రాజకీయ అండ కోసం జనసేనలో చేరడానికి ప్రయత్నించారంట. ప్రస్తుతం జనసేనలో ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారా జనసేనలోకి వెళ్లడానికి ట్రై చేశారన్న ప్రచారం జరిగింది అయితే ఆమెపై ఉన్న అవినీతి ఆరోపణలతో జనసేన నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదంట.. కూటమి పార్టీల్లో చేరే అవకాశం ఎలాగూ లేక పోవడంతో.. ఆమె వైసీపీలోనే భవిష్యత్తు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.రజినీ కోరికను మన్నించి జగన్ ఆమెను తిరిగి చిలకలూరిపేట ఇన్చార్జ్‌గా ప్రయటించడంతో.. ఆమె అక్కడ తన పునాదులు బలోపేతం చేసుకునే పనిలో పడ్డారు. తనపై కేసు నమోదవ్వడంతో ఉలిక్కిపడిన ఆమె.. తనలోని మరో కోణం చూపిస్తున్నారు. తన రాజకీయ గురువు ప్రత్తిపాటిపై రజినీ ఆ స్థాయిలో ధ్వజమెత్తడం ఇదే తొలిసారి.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆమె ఎవరినీ దూషించడం కాని, సవాళ్లు విసరడం కాని చేసిన దాఖలాలు లేవు.. వైసీపీ అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినా ఆమె ప్రత్తిపాటి పుల్లారావుపై గతంలో ఎప్పుడు ఈ స్థాయిలో వార్నింగ్ ఇవ్వలేదు. అయితే తాజాగా ఆమె బరస్ట్ అవ్వడానికి కేసుల భయమే కారణమంటున్నారు. మరి చూడాలి ముమ్ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో?

## పర్యాటకంలో అవకాశాలు అపారం

-మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ ట్రేడ్ ఫేర్ లలో పాల్గొనాలని సూచించారు. అంతర్జాతీయ పర్యాటక ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. టూరిజం అంటే ఈవెంట్స్, టాలెంట్స్, హెూటల్స్, ట్రావెల్ అండ్ టూరిస్ట్ ఆపరేటర్స్, స్కిల్ ఇన్ స్టిట్యూషన్స్ అని సీఎం అభివర్ణించినట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశించారన్నారు. అన్ని వయస్కుల వారు ఆహ్లాదంగా గడిపేలా, పర్యాటక అనుభూతి పొందేలా ఆకర్షించాలన్నారు. గండికోట, ఒంటిమిట్ట, సోమశిల డ్యామ్, తాళ్లపాక అన్నమాచార్యుని స్వస్థలం వంటి ప్రాంతాలను టూరిజం సర్క్యూట్ లుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకించి ఈ ఏడాది చివరి నాటికి హెూటళ్లలో 20వేల రూమ్స్ అందుబాటులోకి తేవాలన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 50 వేల రూమ్స్ అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సరైన సమయ ప్రణాళికతో ముందుకెళ్లి పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీటీడీసీ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ, ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా, టూరిజం శాఖ సెక్రటరీ అజయ్ జైన్, ఆర్కియాలజీ డిపార్ట్ మెంట్ కమిషనర్ జి. వాణిమోహన్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడ, టూరిజం శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, ఈడీలు పద్మావతి, శేషగిరి, ఏపీ టూరిజం అథారిటీ సీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వల్లభనేని వంశీకి బిగుస్తున్న ఉచ్చు

-మొదటిపేజీ తరువాయి

చేసుకోవడం వెనుక ఎవరున్నారనే అంశంపై పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. అ విషయాలు సైతం బయటకు వస్తే.. ఆ తర్వాత వల్లభనేని వంశీతోపాటు పలువురికి ఉచ్చు మరింత బిగుస్తుందనే చర్చ సైతం సాగుతోంది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు గురువారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీతోపాటు మరో 87 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్న సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది. అయితే రెండ్రోజుల క్రితం హఠాత్తుగా సత్యవర్ధన్ కేసును వెనక్కి తీసుకున్నారు.

అయితే వంశీ, అతని అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరింపులు దిగారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. అందుకే అతను కేసు వెనక్కి తీసుకున్నారని పోలీసులకు చెప్పారు. ఈ మేరకు సత్యవర్ధన్‌ను పోలీసులు విచారించగా వాస్తమని తేలింది. దీంతో హైదరాబాద్‌లో ఉన్న వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టు చేసి విజయవాడకు తీసుకు వచ్చారు. ఇక అతడిపై మరో రెండు కేసులు నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 2019 ఎన్నికల సమయంలో.. గన్నవరం నియోజకవర్గంలో నకిలీ పట్టాల పంపిణీతోపాటు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మట్టి కుంభకోణంపైనా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయా కేసులు సైతం అతడిపై నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది.

మరోవైపు.. నకిలీ పట్టాల కేసులో వల్లభనేని వంశీ పాత్ర లేదంటూ గతంలో పోలీసులు తేల్చారు. కానీ ఈ కేసులో విషయంలో అప్పట్లో విచారణ సరిగ్గా జరగలేదంటూ ప్రస్తుతం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఈ కేసులను రీ ఓపెన్ చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆయా కేసులు పునః విచారణకు వచ్చే అవకాశం ఉంది.

**వైసీపీ నేతలకు భారీ షాక్.. ఆ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ రద్దు..**

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసు లో నిందితులకు విజయవాడ కోర్టు షాక్ ఇచ్చింది. 31 మంది నిందితులు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. నిన్న (బుధవారం) కేసుకు సంబంధించిన వాదోపవాదనలు ముగిశాయి. ఈ మేరకు నేడు(గురువారం) వారి బెయిల్ పిటిషన్ కొట్టివేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఇదే కేసులో రిమాండ్ ఖైదీలుగా జైలులో ఉన్న ఐదుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు విచారణ జరుగుతుండగానే కోర్టుకు వచ్చిన ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కేసును విత్ డ్రా చేసుకున్నారు. కేసు విత్ డ్రా చేసుకోవాలని వైసీపీ నేతలు కిడ్నాప్ చేసి బెదిరింపులకు దిగడంతో బాధితుడు ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు. కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ ఘటనపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని గురువారం ఉదయం హైదరాబాద్‌లో అరెస్టు చేసి విజయవాడకు తరలించారు. కాగా, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నేత వంశీని పోలీసులు సుదీర్ఘంగా విచారిస్తున్నారు. వంశీ భార్య జైలు బయటే ఆయన కోసం ఎదురుచూస్తున్నారు.

## టూరిజం ప్రాజెక్టులకు మహర్దశ

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటకరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ముఖ్యంగా టూరిజం ప్రాజెక్టులను త్వరితగతిన వేగంగా పూర్తి చేయడానికి అడుగులు వేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అనుమతులు శరవేగంగా రావడానికి అవసరమైన ప్రతిపాదనలకు ఓకే చెప్పనుంది. దీంతో ఏపీలోని పలు టూరిజం ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. ఆంధ్రప్రదేశ్ స్వదేశీ దర్శన్ క్రింద అభివృద్ధి చేయనున్న నాగార్జున సాగర్, అహోబిలం, సూర్యలంక ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన ఆమోదించాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అభ్యర్థనకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించారు. మరో వారం, పది రోజుల్లో సంబంధిత ప్రక్రియ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు మంత్రి కందుల దుర్గేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ , కేంద్ర ప్రభుత్వ పథకాల సహకారంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. ప్రధానంగా విశాఖపట్టణం జిల్లా సింహాచలం ఆలయ అభివృద్ధి పనులు అరవై శాతం పూర్తయ్యాయని, కాకినాడ జిల్లా అన్నవరం దేవాలయ అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారుఇవన్నీ పూర్తయితే పర్యాటక రంగం పూర్తిగా అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్రానికి కూడా అదనంగా ఆదాయం రానుంది. గత ప్రభుత్వం లెక్కకు మించిన అప్పులు చేయడంతో దానిని పూడ్చుకునేందుకు ప్రతి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోకస్ పెట్టారు. అందులో ఏపీలో టూరిజానికి ప్రత్యేకత ఉంది. దేవాలయాలతో పాటు విశాలమైన సముద్ర తీర ప్రాంతం కూడా ఉండటం, బీచ్ లతో పాటు కోనసీమ అందాలు వంటి వాటితో పాటు అరకు వంటి వాటిని హైలెట్ చేయగలిగితే ఎక్కువ మంది పర్యాటకులు వచ్చే అవకాశముంది. ఏపీకి టూరిజం నుంచి అత్యధిక ఆదాయం రాబట్టేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేయడంలో భాగంగా ప్రతి చిన్న విషయాన్ని కూడా పరిశీలిస్తుంది. వాటిని గ్రౌండ్ చేయడానికి సిద్ధమవుతుంది. అక్కడ పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు రవాణా, వసతి వంటి సౌకర్యాలపై దృష్టి పెట్టింది.

## చంద్రబాబు ఫోన్ లిఫ్ట్ చేయని జనసేనాని

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ కు కూడా దూరంగా ఉన్నారు. కనీసం ముఖ్యమంత్రికి సమాచారం ఇవ్వకుండా పవన్ కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం దక్షిణ భారత దేశంలోని తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు మూడు రోజుల పర్యటనకు వెళ్లడమూ రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే పవన్ కల్యాణ్ గత కొద్ది రోజుల నుంచి ఏపీ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అధికారిక కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొనడం లేదు. అయితే ఆయనకు జ్వరంతో పాటు తీవ్రమైన నడుంనొప్పి ఉందని, వైద్యుల సూచనల మేరకు ఆయన హైదరాబాద్ లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.స్పాండిలైటిస్ తో బాధపడుతూ, జ్వరం బారిన పడిన పవన్ కల్యాణ్ కొద్దిగా తేరుకున్న వెంటనే సనాతన ధర్మయాత్ర పేరిట దేవాలయాల సందర్శనకు వెళ్లారంటే ఎవరూ నమ్మడం లేదు. ఈ నెల 6వ తేదీన పవన్ కల్యాణ్ మంత్రి వర్గ సమావేశానికి హాజరు కాలేదు. అలాగే నిన్న కార్యదర్శులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశాలకు కూడా దూరంగానే ఉన్నారు. తన శాఖలకు సంబంధించిన విషయాలను కూడా గత కొద్ది రోజుల నుంచి పట్టించుకోవడం లేదు. వాటిన్నింటినీ పక్కన పెడితే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసినప్పుడు ఆయన లిఫ్ట్ చేయకపోవడం కూడా రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది.

## సంపాదకీయం

# ఆప్ భవిష్యత్ కార్యాచరణ భేటీ!

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం కూలిపోవడంతో ఆ పార్టీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం పంజాబ్‌లో ప్రభుత్వ మనుగడపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓటమినుండి కోలుకోకముందే హడావుడిగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం ఢిల్లీలో పంజాబ్ పార్టీ ఎంఎల్‌ఎల సమావేశం ఏర్పాటు చేయడం గమనిస్తే ఆయనలో కంగారు కనిపిస్తుంది. ఈ సందర్భంగా పలు ఊహాగానాలు కూడా వెలువడుతున్నాయి. బిజెపి సైతం తమ తర్వాతి లక్ష్యం పశ్చిమ బెంగాల్, పంజాబ్ అని చెప్పడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లో అయితే వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగవలసి ఉండడంతో ఆ రాష్ట్రంపై దృష్టి సారించడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ మరో రెండేళ్ల పదవీకాలం ఉన్న పంజాబ్ ప్రభుత్వంపై దృష్టి సారించడం అంటే ప్రభుత్వాన్ని అస్థిరం కావించే ప్రయత్నం చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సందర్భంగా పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా చేస్తున్న ప్రకటనలు గందరగోళం కలిగిస్తున్నాయి. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ బిజెపికి తదుపరి 'ఏక్‌నాథ్ షిండే' అని చెప్పడం ద్వారా ముఖ్యమంత్రి ద్వారానే ప్రభుత్వాన్ని కూల్చివేసే ప్రయత్నం చేస్తారా? అనే అనుమానం కలుగుతుంది. మరోవంక, ఆయనే 30 మంది ఆప్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని అంటూ కలకలం రేపారు. అయితే, ఆయన ప్రకటనలను మాన్ ఖండించారు అనుకోండి. ఇట్లా ఉండగా, మాన్‌ను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించేందుకు స్వయంగా కేజ్రీవాల్ నిర్ణయించుకున్నారని అంటూ ఢిల్లీలో ఎంఎల్‌ఎ గా ఎన్నికైన బిజెపి నేత మంజీందర్ సింగ్ సిర్సా ఆరోపణలు చేశారు. తానే పంజాబ్ ముఖ్యమంత్రి కావాలని కేజ్రీవాల్ చూస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఏదేమైనా ఢిల్లీ ప్రభుత్వం కోల్పోవడంతో కేజ్రీవాల్ ఇక ఎక్కువగా పంజాబ్ ప్రభుత్వంపై దృష్టి సారిస్తారన్నది మాత్రం యదార్థం. దానితో అక్కడి ప్రభుత్వం ఆయన కనుసన్నలలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఆప్ రాజకీయ కార్యకలాపాలకు అవసరమైన వనరులను సమకూర్చాల్సిన బాధ్యత కూడా మొత్తంగా పంజాబ్ ఆప్‌పై పడుతుంది. పైగా, పుష్కర కాలంగా ఆప్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన 'ఢిల్లీ మోడల్' తాజా ఎన్నికల్లో విఫలమైంది. ఆ పేరుతో ఓట్లు రాబట్టడం ఇంకేమాత్రం సాధ్యం కాదని వెల్లడైంది. పంజాబ్‌లో సైతం 'ఢిల్లీ మోడల్' పేరుతో అధికారంలోకి వచ్చారు. అందుకనే పంజాబ్‌లో తమ ఎత్తుగడలను మార్చుకొనని పక్షంలో 2027లో జరిగే ఎన్నికలలో నెగ్గుకు రావడం సాధ్యం కాదు. దానితో ప్రభుత్వ ప్రాధాన్యతలను పూర్తిగా మార్చుకోవలసి ఉంది. అయితే మహారాష్ట్రలో మాదిరిగా మరో ఏక్‌నాథ్ షిండే ద్వారా పంజాబ్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయడం బిజెపికి సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే ఇక్కడ బిజెపికి ఇద్దరు మాత్రమే ఎంఎల్‌ఎలు ఉన్నారు. ఒక్క ఎంపి కూడా లేరు. మహారాష్ట్రలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోయినా వరుసగా మూడు ఎన్నికలలో అతిపెద్ద పార్టీగా ఏర్పడింది. దానితో అక్కడ రాజకీయంగా ఆధిపత్యంలో ఉండగలిగింది. పైగా, ఆప్ తర్వాత అన్ని వర్గాలలో చెప్పుకోదగిన బలం ఉన్న పార్టీ కాంగ్రెస్ అయినప్పటికీ ఆ పార్టీలో వర్గాలకు అంతులేదు. ఒక నాయకుడంటే మరో నాయకుడికి పడదు. కొత్తగా ఆప్ నాయకులను చేర్చుకొంటే మరో కుంపటి ఏర్పాటు చేసుకున్నట్లు కాగలదు. అయితే, అరుణాచల్‌ప్రదేశ్ మోడల్‌లో పంజాబ్ ప్రభుత్వంపై బిజెపి కన్నేసే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు. 2014 అరుణాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. రెండేళ్ల తర్వాత సిఎం నబమ్ తుకి తప్ప మిగతా కాంగ్రెస్ ఎంఎల్‌ఎలందరూ పార్టీ నుంచి విడిపోయి పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో చేరారు. ఈ ఎంఎల్‌ఎలలో ఎక్కువ మంది కొన్ని నెలల తర్వాత బిజెపిలో విలీనం అయ్యారు. ఆ విధంగా బిజెపి ప్రభుత్వం ఏర్పడింది. కెప్టెన్ అమరీందర్ సింగ్ పంజాబ్ లోక్ కాంగ్రెస్ పార్టీతో బిజెపి ఇప్పటికే విలీనమై అటువంటి ఓ ప్రయత్నం చేసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. 2022లో పంజాబ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆప్ ఇప్పటివరకు చీలికల నుండి సురక్షితంగా ఉంది. వ్యక్తిగత ఎంఎల్‌ఎలు కూడా పెద్దగా ఫిరాయింపులకు పాల్పడిన దాఖలాలు లేవు. ఢిల్లీలో కూడా, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొంతమంది నాయకులు బిజెపిలో చేరడం తప్ప, ఆప్ పెద్దగా చీలికలకు గురికాలేదు. 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో తిరిగి అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు ఆప్‌ను బలహీనపరచగలననే ధీమాతో ఉన్నట్లు కనిపిస్తున్నది. మరిన్ని అవినీతి కేసులతో ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అదే విధంగా పంజాబ్‌లో ఆప్‌లో చీలికలు తీసుకువచ్చే ప్రయత్నం చేయవచ్చనే ఊహాగానాలకు ఆస్కారం ఏర్పడుతుంది. అందుకే మన్ ఏక్‌నాథ్ షిండేగా మారవచ్చని బజ్వా ఆరోపించారు. బిజెపి కూడా పంజాబ్‌లో తాను ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేకపోతున్నానని గ్రహించింది. సుదీర్ఘకాలం అకాలీదళ్‌తో పొత్తు ఏర్పర్చుకున్నప్పటికీ పట్టణ ప్రాంతాలలో కొన్ని సీట్లను మించి గ్రామీణ ప్రాంతాలలోకి చొచ్చుకువెళ్లలేకపోయింది. కాబట్టి రాష్ట్రంలో బలం పెంచుకునేందుకు ఇప్పుడు బిజెపికి ఏకైక మార్గం రాష్ట్రంలోని ఇతర 3 పార్టీలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ (ఆప్, కాంగ్రెస్, ఎస్‌ఎడి) పార్టీలలో చీలికలు తీసుకు రావడమే. అయితే, 2020– 21 రైతుల నిరసన సమయంలో మాదిరిగా ఇప్పుడు పంజాబ్‌లో బిజెపి పట్ల ప్రతికూలత అంత తీవ్రంగా ఉండకపోవచ్చు గాని, చెప్పుకోదగినంతగా ఉంది. ముఖ్యంగా గ్రామీణ సిక్కు జనాభాలో ప్రతికూలత ఎక్కువగా ఉంది. అందువల్ల, ఎవరైనా బిజెపితో చేతులు కలపడానికి ఆప్ లేదా కాంగ్రెస్ లేదా ఎస్‌ఎడిలను విభజించినట్లయితే, కనీసం గ్రామీణ ఓటర్లలో రాజకీయంగా నష్టం వాటిల్లుతుంది. ఉదాహరణకు, పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి బలమైన అభ్యర్థి రవ్‌నీత్ బిట్టు లూథియానాలోని గ్రామీణ ప్రాంతాలలో దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సిక్కు ఓటర్లలో బిజెపి పట్ల నెలకొన్న ప్రతికూలత సైతం పంజాబ్‌లో ఆ పార్టీ విస్తరణకు అడ్డంకిగా నెలకొంది. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి సిక్కు అభ్యర్థులు చాలా మంది గెలిచారు. రాజౌరి గార్డెన్ నుండి మంజిందర్ సింగ్ సిర్సా, గాంధీనగర్ నుండి అరవిందర్ సింగ్ లవ్లీ, జంగ్పురా నుండి తర్విందర్ మార్వా వంటి వారు గెలుపొందగారు. ఆప్ సిక్కు అభ్యర్థులలో తిలక్ నగర్ నుండి జ్నల్ సింగ్, చాందిని చౌక్ నుండి పునర్దీప్ సింగ్ సాహ్నీ గెలుపొందారు. ఆప్ నుండి సురీందర్ పాల్ సింగ్ బిట్టూ, జితేందర్ సింగ్ షుంటి వరుసగా తిమార్పూర్, షాదరాలో బిజెపి చేతిలో తృటిలో ఓడిపోయారు. అయితే, సిక్కులలో బిజెపి ఇప్పటికీ గణనీయమైన తేడాతో వెనుకబడి ఉండవచ్చని సర్వేలు సూచిస్తున్నాయి. యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్ పోల్ ప్రకారం 69 శాతం సిక్కులు ఆప్‌కు ఓటు వేయగా, 24 శాతం మంది బిజెపికి ఓటు వేశారు. సివోటర్ సర్వే ప్రకారం 49 శాతం సిక్కులు ఆప్‌కు ఓటు వేయగా, బిజెపికి 34 శాతం మంది ఓటు వేశారు. సిర్సా, లవ్లీ, మార్వా వంటి బలమైన సిక్కు అభ్యర్థులు ఉన్న ప్రదేశాలలో ఆ వర్గం బిజెపికి మద్దతు ఇచ్చి ఉండవచ్చు, అయితే ఇతర చాలా స్థానాల్లో ఆప్ మొదటి ప్రాధాన్యతను పొందింది.ఢిల్లీ సిక్కులు పంజాబ్‌లోని వారి కంటే భిన్నమైన ఓటింగ్ సరళిని కలిగి ఉన్నప్పటికీ, జాతీయ రాజధానిలో సిక్కులలో ఆప్ ఇప్పటికీ నంబర్ వన్ ఎంపికగా ఉందన్నది వాస్తవం. రెండు సర్వేల ప్రకారం కాంగ్రెస్‌కు మద్దతు 5 శాతం కంటే తక్కువకు తగ్గింది. ఈ వాస్తవాలు పంజాబ్ లో ఆప్‌కు బలమైన ప్రాతిపదిక ఏర్పాటుకు దారితీస్తుంది. మరోవంక, అకాలీదళ్ తీవ్రమైన నాయకత్వ సంక్షోభంలో మునిగిపోవడం సైతం ఆ పార్టీకి కలిసి వస్తుంది. మరోవంక, కేజ్రీవాల్, ముఖ్యమంత్రి మాన్‌ల మధ్య ఎన్నడూ ఎటువంటి విభేదాలు తలెత్తిన సందర్భాలు లేవు. కేజ్రీవాల్‌కు నమ్మినబంటుగా వ్యవహరిస్తున్నారు. పైగా, ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం లేకపోవడంతో మొత్తం ఆప్ పంజాబ్ ప్రభుత్వంపై ఆధారపడాల్సి ఉంటుంది. దానితో ఆప్‌లో మాన్ ప్రాధాన్యత మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇటువంటి సమయంలో ఆ ప్రభుత్వాన్ని అస్థిర పరచేందుకు ఆప్ నుండి ప్రయత్నాలు జరిగే అవకాశాలు తక్కువ. ఇంకోవైపు, కేజ్రీవాల్, ఆప్ ఢిల్లీ నాయకత్వంతో పోలిస్తే, పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ కేంద్రంతో మెరుగైన సంబంధాలను కొనసాగిస్తున్నారు.

# ముచ్చింతల్ ఆధ్యాత్మిక పరిమళాలు



ముచ్చింతల్ లో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి మూడేళ్లు పూర్తయింది. ఈ విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 5 ఫిబ్రవరి 2022న వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆవిష్కరించి జాతికి అంకితం ఇచ్చారు. 2025 వసంత పంచమితో విగ్రహావిష్కరణ మూడేళ్లు పూర్తి చేసుకుంది. రాజా ఆదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, – బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు – గొప్ప వని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజా చార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, – సాటిలేని భక్తి తత్పరునిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించే నాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హొయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వక్రతు కేశవ సోమయాజి దీక్షితార్, కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం 1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు రామానుజులు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో 45 ఎకరాల విస్తీర్ణంలో పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సత్ సంకల్పంతో దివ్య క్షేత్ర పనులు 2016లో ప్రారంభ మయ్యాయి. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.1000 కోట్లతో పనులు జరిగాయి. పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, విజయనగర నిర్మాణ శైలులను కలగలిపి వివిధ 2700 మంది శిల్పుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టగా, ప్రధానంగా.. సమతామూర్తి 216 అడుగుల, 1800 కిలోల బరువు గల మహా పంచలోహ విగ్రహాన్ని 1600 భాగాలుగా తొమ్మిది నెలల కఠోర శ్రమ తో చైనాలో తయారు చేయించారు. మన దేశానికి తెచ్చాక చైనాకు చెందిన 60 మంది నిపుణులు విగ్రహ రూపునిచ్చారు. వెయ్యేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సమతామూర్తి మహా విగ్రహం చుట్టూ శ్రీవైష్ణవంలో దివ్యదేశాలుగా భావించే 108 పుణ్య క్షేత్రాలు, గర్భాలయాల ఆకృతిలో 108 ఆలయాలను నిర్మించారు. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో 468 స్తంభాలతో భారీ దివ్యదేశ మండపాన్ని నిర్మించారు. సమతామూర్తి విగ్రహ దిగువ న భద్రవేదిక 54 అడుగులు, పద్మ పీఠం 27 అడుగులు, శ్రీరామాను జాచార్యుల విగ్రహం 108 అడుగులు, స్వామి చేతిలోని త్రిదండం 27 అడుగుల ఎత్తు ఉన్నాయి. మహా విగ్రహం కింద విశాలంగా ఉన్న గర్భగుడిలో 120 కిలోల బంగారు విగ్రహ రూపంలో రామానుజులు నిత్య పూజా. మూర్తిగా దర్శనం ఇస్తారు. అలా వెయ్యేళ్ల క్రితం భారతావనిలో నడయాడిన సమతా మూర్తి జగద్గురు శ్రీరామాను జాచార్యులు భక్తులకు నిత్య దర్శనం ఇస్తున్నారు. ముచ్చింతల్‌లో గల త్రిదండి చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి రెండేళ్లు పూర్తయింది. 2022 ఫిబ్రవరి 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా ఈ సమతా మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. వసంత పంచమితో మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. గత మూడేళ్లుగా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు.

# నవ్వుల రారాజు రాజబాబు



పుణ్యమూర్తుల అప్పలరాజు అనగానే ఎవరా అని ఆలోచించవచ్చు. రాజబాబు అంటే హాస్య నటునిగా తెలియని తెలుగు వారుండరు. రేలంగి, రమణారెడ్డి తరవాత అంతకు మించిన ప్రేక్షక ఆదరణ పొందిన నటునిగా గుర్తింపు పొందారు.తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత గొప్ప హాస్య నటుల్లో ఒకరు రాజబాబు. రెండు దశాబ్దాల తక్కువ వ్యవధిలో ఆయన శిఖర స్థాయిని అందుకున్నారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన రాజబాబు.. తెలుగు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. అప్పట్లో ఆయన దక్షిణాదిన అత్యంత డిమాండ్ ఉన్న కమెడియన్లలో ఒకరు. రోజుకు రెండు మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా పని చేసిన ఘనత ఆయనది. తెలుగు చలనచిత్ర రంగంలో రెండు దశాబ్దాలు హాస్యనటునిగా వెలిగిన రాజబాబు (అక్టోబరు 20, 1935 – ఫిబ్రవరి 14, 1983) "శతాబ్దపు హాస్య నటుడి"గా ప్రసంశలు అందుకొన్న గొప్ప వ్యక్తి. అక్టోబరు 20, 1935 తేదీన పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం లో పుట్టిన రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. తల్లిదండ్రులు శ్రీ పుణ్యమూర్తుల ఉమామహేశ్వర రావు , శ్రీమతి రవణమ్మ. నిడదవోలు లోని పాఠశాల చదువు చదువుతూనే బుర్రకథ నేర్చుకోవడానికి శ్రీ అచ్యుత రామయ్య గారి దగ్గర చేరారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు ముగించి తెలుగు ఉపాధ్యాయునిగా కొద్దికాలం పని చేశారు. ఉపాధ్యాయునిగా పనిచేసేటప్పుడే నాటకాలలో పాలుపంచుకొనేవారు. రాజబాబు డిసెంబరు 5, 1965 తేదీన లక్ష్మీ అమ్మలు ను వివాహమాడాడు. వారికి నాగేంద్రబాబు, మహేశ్ బాబు అనే ఇద్దరు సంతానం కలిగారు. ఒక సారి నాటకంలో రాజబాబును చూసిన గరికపాటి రాజారావు (పుట్టిల్లు సినిమా దర్శకుడు) సినిమాలలో చేరమని ఉత్సాహ పరిచారు. దాంతో చెప్పా చెయ్యకనే ఫిబ్రవరి 7, 1960 రోజున మద్రాసు చేరుకొన్నారు. పూట గడవడానికి హాస్య నటుడు అడ్డాల నారాయణరావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. కొన్నాళ్ళ తరువాత అడ్డాల నారాయణరావు రాజబాబుకి సమాజం సినిమాలో అవకాశం కల్పించారు. మొదటి సినిమా తరువాత "తండ్రులు–కొడుకులు", "కులగోత్రాలు", "స్వర్ణగౌరి", "మంచి మనిషి" మొదలగు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. స్వర్ణగౌరి చిత్రానికి గాను 350 రూపాయలు మొట్టమొదటి పారితోషికంగా స్వీకరించారు. మొదటి చిత్రం విడుదల తరువాత వచ్చిన చిన్న చిన్న పాత్రలలో నటిస్తూనే "కుక్కపిల్ల దొరికిందా", "నాలుగిళ్ళ చావిడి", "అల్లూరి సీతారామరాజు" మొదలగు నాటకాలు వేశారు. జగపతి ఫిలింస్... వి.బి.రాజేంద్రప్రసాద్ చిత్రం "అంతస్తులు" చ్రిత్రంలో నటించినందుకు గాను మొట్ట మొదటి సారిగా పెద్దమొత్తం 1300 రూపాయల్ని పారితోషికంగా పొందారు. ఇక వెనక్కు తిరిగి చూసుకో వలసిన అవసరం లేకుండా వరుసగా నిర్మాణ సంస్థలు నిర్మించిన ఎన్నో చిత్రాలలో నటించారు. ఆకాశ రామన్న, సతీ శబరి, ప్రచండ భైరవి, సత్య హరిశ్చంద్ర, సంగీత లక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడి కుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాలలో నటించారు. రాజబాబుకు జంటగా లీలా రాణి, మీనా కుమారి, ప్రసన్న రాణి, గీతాంజలి లాంటి వారు నటించినా, ప్రేక్షకాదరణ పొందిన జోడీ మాత్రం రమాప్రభ అని చెప్పాలి. ఇద్దరు అమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రెటరి, జీవన జ్యోతి, కార్తీక దీపం, అడవి రాముడు, సోగ్గాడు లాంటి చిత్రాలు రాజబాబు – రమాప్రభ జోడీకి మంచి హాస్య జంటగా పేరు తెచ్చాయి. రాజబాబు తాతా మనవడు, పిచ్చోడి పెళ్ళి, తిరుపతి, ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి సినిమాలలో హీరోగా నటించారు. ఈ సినిమాలలో ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు సినిమాలను స్వయంగా బాబ్ %డ% బాబ్ ప్రొడక్షన్స్ అన్న నిర్మాణ సంస్థ పేరుతో నిర్మించారు. సినిమాలో ప్రేక్షకులను తన అద్భుత నటనతో కడుపుబ్బ నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచనలు గలవారు. ప్రతి ఒక్క సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా పాతతరం నటుల్ని, నటీమణుల్ని సత్కరించే వాడు. ప్రత్యేకంగా హాస్యంలో తనకు స్ఫూర్తిని ఇచ్చిన బాలకృష్ణను సత్కరించారు. రాజబాబుచే సత్కారం పొందిన వారిలో ఇంకా డా.శివరామ కృష్ణయ్య, సూర్యకాంతం, సావిత్రి, రేలంగి మొదలగు ప్రముఖులు ఉన్నారు. ఎన్నో సంస్థలకు ఎన్నెన్నో విరాళాలిచ్చిన దాత రాజబాబు. రాజమండ్రిలో చెత్తా చెదారం శుభ్రపరిచే వాళ్ళకు అదే ఊరిలో దానవాయి పేటలో భూమి ఇచ్చారు. అంతే కాక కోరుకొండలో జూనియర్ కాలేజీ కట్టించారు. దాని పేరు కూడా ఆయన పేరు మీదే "రాజబాబు జూనియర్ కళాశాల"గా ఉంది. వరుసగా ఏడు సార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు రాజబాబు. ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలిమ్ ఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు రివార్డులూ పొందారు. "చెన్నై ఆంధ్రా క్లబ్బు" వారు వరుసగా ఐదు సంవత్సరాలు "రోలింగ్ షీల్డు"ని ప్రధానం చేసారు. అంతే కాక శతాబ్దపు హాస్య నటుడిగా అవార్డు పొందారు. రాజబాబుకు ఘంటసాల పాటలంటే ఎంతో ఇష్టం. మహా శివరాత్రి రోజు, ఘంటసాల వర్ధంతి అయిన ఫిబ్రవరి 11 రోజున మొత్తం ఘంటసాల పాటలు వింటూనే ఉన్నారు. అదే రోజు రాత్రి గొంతులో ఏదో ఇబ్బంది వచ్చి హైదరాబాదు లోని థెరెసా ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆసుపత్రి లోనే ఫిబ్రవరి 14, 1983 రోజున తెలుగు సినీ అభిమానుల్ని శోక సముద్రంలో ముంచి స్వర్గస్తుడయారు. అనుకరించడానికి అసాధ్యమైన ప్రత్యేకమైన శైలి రాజబాబుది. ఆయన మరణంతో తెలుగు చిత్రసీమకు కలిగిన లోటు ఎప్పటికి తీర్చలేనిది.

# రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్



**గుంటకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్ పట్టణంలో సిపిఐ ఆఫీస్ నందు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా గోపీనాథ్ వ్యవహరించారు ఈ సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ హాజరై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని సిపిఐ గా డిమాండ్ చేస్తున్నాము భారతదేశంలో బ్రిటిష్ పాలన కాలంలోనే 1872 లోనే జనాభా లెక్కల మొదలైనవి 1935 వరకు బ్రిటిష్ అధికారులు జనాభా లెక్కల సేకరించినప్పుడు కులాల సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించేవారు స్వతంత్రం వచ్చిన తర్వాత తొలిసారి 1951 లో జనాభా లెక్కలు చేపట్టినప్పుడు అప్పుడు కూడా షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగలు సమాచారం మాత్రమే సేకరించారు అయితే 1980 లలో పరిస్థితులు మారాయి కులాల ఆధారంగా పుట్టుకొచ్చిన కొన్ని ప్రాంతీయ పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో చక్రం తిప్పడం మొదలుపెట్టాయి 40 రాజకీయాల్లో అగ్రవర్ణాలు అధిపతి అని వ్యతిరేకంగా కూడా ఎదుర్కోవడం కులాల విద్యాసంస్థలు ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇవ్వాలని ఉద్యమాలు కూడా మొదలయ్యాయి అప్పట్లో చైనా దేశంలోనే ఎక్కువ జనాభా ఉండేది ఇప్పుడు భారతదేశంలో ఎక్కువ జనాభా ఉంది కర్ణాటకలో కుల గణన సమాచారాన్ని సేకరించారు కానీ ఈ సమాచారాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం బయటకు వెల్లడించడం లేదు సామాజిక ఆర్థిక కుల గణన లో భాగంగా 2011లో సేకరించిన సమాచారాన్ని బయటపెట్టబోమని జూలై 22న పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించినది 1931 జనాభా లెక్కల్లో కులాల సంఖ్య 4147 గా ఉండేది కానీ 2011 జనాభా లెక్కల ఈ సంఖ్య 46 లక్షల పైనే ఉన్నట్లు కనిపిస్తుందని కేంద్రం తెలిపింది బీసీ ముస్లింలు 10.8% మొత్తం బీసీల సంఖ్య ఎస్టీలు 10.4 శాతం మొత్తం ముస్లింలు 2.83 ఇతర ముస్లింలు 13.1% ఓసి జనాభా 15% తెలంగాణలో ఉంది కానీ చట్టసభల్లో 42% ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పారని అన్నారు భారతదేశంలో ప్రతి కులానికి పంపకాలు చేయాలని అప్పుడే వారు సంపన్నులవుతారని అన్నారు ఓసి, బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీలు అందరం కూడా దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అప్పుడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తల దించుతాయని అట్టడుగు వర్గాల వారికి సమాజంలో ఆర్థికంగా. రాజకీయంగా ఉపయోగపడుతుందని దీనికి మనందరం నడుం బిగించాలని సిపిఐ తరఫున కోరుతున్న ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సభ్యులు గోవిందు బిఎస్పి నియోజకవర్గ నాయకులు శ్రీనివాసరాజు రజక సంఘం నాయకులు దేవేంద్రప్ప ,బలిజ సంఘం నాయకులు పూల రమణ గోవిందరాజు రంగ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు స్వామి దాస్ ఎం హెచ్ పి ఎస్ నరసింహులు వాల్మీకి నాయకులు సూర్యనారాయణ వైయస్సార్ మైనార్టీ నాయకులు ఖలీల్ , భాషిద్ కురువ సంఘం నాయకులు సోమశేఖర్, రామప్ప మల్లికార్జున క్రిస్టియన్ సంఘం నాయకులు సాల్మన్ రాజు, రాజు సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసులు కుళ్లాయప్ప సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర గుంతకల్ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ మండల కార్యదర్శి రాము రాయల్ ఏఐటియుసి ఈశ్వరయ్య పట్టణ అధ్యక్షులు సురేష్ మల్లయ్య వంశీ తదితరులు పాల్గొన్నారు

# వాహన ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి..

జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాయుడు..
రహదారి భద్రత పై ప్రచారం..
జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా ర్యాలీ..



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** వాహన ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్ర త్తలు తప్పనిసరిగా పాటించాలని, భద్రతా మాసోత్సవాలు సందర్భంగా జిల్లాలో అన్ని వర్గాలను కలుపుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్. చిన్న రాముడు అన్నారు.గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సంద ర్భంగా గురువారం ఆర్ట్స్ కళాశాల నుంచి కార్లు, ఆటో లు, మోటార్ సైకిళ్ళతో ర్యాలీ ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, అడిషనల్ ఎస్పీ, ఏవి సుబ్బారావు, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించక పో వడం, ట్రాఫిక్ రూల్స్ పాటించ కపోవడం వల్ల ఏటా చాలా మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు రవాణాశాఖ గత నెల జనవరి నెల నుండి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తుందని అన్నారు.ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగ్గా పాటించాలన్నారు.ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్, కారు నడిపేటపుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధన లు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహన ప్రయాణ సమయం లో చేసే చిన్న పొరపాటు వల్ల మీతోపాటు ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ వాహన ప్రమాదాలు నివారించేందుకు ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమా లు రూపొంది స్తోందని అన్నా రు. ప్రజల్లో చైతన్యం రావాలనే అవగాహన ర్యాలీలు ఏర్పా టు చేసినట్లు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. మితిమీరిన వేగం తో, వాహనాల్లో నిర్దేశించుకున్న సంఖ్య కంటే ఎక్కువ గా మితిమీరిన ప్రయాణికులతో ప్రయాణిం చడం చట్టరిత్యా నేరం అన్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే ఎటువంటి నష్ట పరిహారం కూడా అందే అవకాశం లేదని, మనం ఇంటి వద్ద బయలుదేరే సమయంలో తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవడానికి భద్రత నిబంధనలు ఖచ్చితం గా పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సిహెచ్. సంపత్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రావు, అసిస్టెంట్ మోటార్ వెహిక ల్ ఇన్స్పెక్టర్స్, జి రాధికా దేవి, పి. వి. వి. డి. సాయి కుమార్, రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పి.మాధురి , పెద్ద ఎత్తున ద్వి చక్ర వాహనదారులు, క్యాబ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పార్టీ కార్యాలయం

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండండి
వైసిపి పార్టీ బలోపేతమే ప్రతీ ఒక్కరి ధ్యేయం
రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేయాలి
మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం





**ఆమదాలవల,ఫిబ్రవరి 13 ,ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ,వైఎస్సార్సీపీ పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని మాజీ స్పీకర్,శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం నాడు ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్సీపీ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్యాలయాన్ని ఘనంగా ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలకు వేదికగా పార్టీ కార్యాలయం ఉండాలన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం కల్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు.వంచన చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోస పూరిత పాలనను ప్రజలకు వివరించాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరి పైన ఉందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేమని చేతిలెత్తేయడం కూటమి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. లక్షల కోట్లు అప్పులు చేస్తూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వ చేస్తున్న మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు నాయకులు ఎండగట్టాలని తెలిపారు. వైసిపి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఓటమిని చవిచూసినప్పటికి వైసిపి పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రజల్లో ఎనలేని మద్దతు,ఆధర అభిమానాలు ఉన్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో మరలా జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆ దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యన్నారాయణ మాట్లాడుతూ వైసిపి నాయకులకు , కార్యకర్తలకు,ప్రజలకు అందుబాటులో ఉండేందుకే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రతీ ఒక్కరితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పట్ల కృషి చేస్తే ప్రజలే గుర్తిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు ( లక్ష్మణ రావు ) మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ బలోపేతమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గ పరిస్థితులను బట్టి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజల తరపున గొంతుగా ప్రజా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. వర్గ విభేదాలు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే వైసిపి పార్టీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త తమ గుండెల్లో వైసిపి జెండాను మోస్తూ ప్రతీ ఒక్క గ్రామంలో వైసిపి పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్ , , ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ మూర్తి ,వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవింద రావు,ఆమదాలవలస జెడ్పీటీసీ బెండి గోవింద రావు ,పొందూరు మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, జెడ్పీటీసీ లో లు గు కాంతారావు,సురవరపు నాగేశ్వర రావు , బెవర మల్లేశ్వర రావు , కె నాగేశ్వర రావు , బెజ్జిపురం రామారావు ,పొందూరు మండలానికి సంబంధించిన నేతలు ఉప ఎంపీపీ ప్రతినిధి వండాన సూరాపు నాయుడు , ఎ.ఎం.సి మాజీ ఛైర్మెన్ బాడాన సునీల్ , పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు , బాడాన కృష్ణ ,బొడ్డేపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి రమణా రావు , తవిటి రెడ్డి , ఉత్తరాంధ్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు గొర్లె సూర్యారావు , పైడి రాజగోపాల్ ,నాలుగు మండలాల ఎంపీపీలు , సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మద్యం షాపు లైసెన్సు రద్దు చేయాలి

## ఐద్వా మహిళా సంఘం

**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** ఈరోజు గుంతకల్లు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ, మరియు ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మద్యం ధరలను ఉపసంహరించుకోవాలని, సమయపాలన పాటించకుండా ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచితున్న మద్యం షాపుల వారి లైసెన్సులు రద్దు చేయాలని. డిమాండ్ చేస్తూ.. హంపిరెడ్డి భవన్ వద్దనుండి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి.. నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం గత మూడు రోజుల క్రితం ఆర్థిక సర్దుబాటు లోటు ఉందని మద్యం ధరలను 14% శాతం పెంచడం జరిగింది దీనివలన పేదలు, మధ్యతరగతి, దినకూలి చేసుకునే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యం ధరలు తగ్గిస్తాం అని చెప్పి. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ధరలను పెంచడం సమయపాలన వేళాపాల లేకుండా ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 వరకు మద్యం షాపులను తెరిచి పెట్టడం వలన కొంతమంది మద్యం మత్తులో అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారు దీనివలన క్రైమ్ రేటు పెరుగుతున్నది గొడవలు, అత్యాచారాలు, వేధింపులు పెరిగాయి.. దీనివలన మహిళలు ఇళ్లల్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కావున రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మద్యం ధరలను ఉపసంహరించుకోవాలని, అలాగే మద్యం దుకాణాల దారులు సమయపాలనను పాటించాలని, మద్యం నియంత్రన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు రాము నాయక్, జయమ్మ, లక్ష్మీబాయి, సూరి, షాష, యం. భాష, మరియు శాఖ కార్యదర్శిలు షకీరా, ఖాదర్, రాము, ఈరన్న, శివయ్య, ధ్యానియల్, జాషువా, లక్ష్మి, లక్ష్మమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు..

## మహిళల భద్రతను బలోపేతం చేసేందుకే సపోర్టు సెంటర్...

జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్..
ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్లో
సపోర్ట్ సెంటర్ ప్రారంభించిన ఎస్పీ..




**ఏలూరు, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడానికి, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ కిషోర్ పేర్కొన్నారు. మహిళా పోలీస్ స్టేషన్లో గురువారం ఎస్పీ సపోర్ట్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ సెంటర్ లో భూమిక ఉమెన్ కలెక్టివ్ ప్రతినిధులు మహిళల సమస్యలను నేరుగా విని అవసరమైన సహాయం అందజేస్తారని అన్నారు. “మహిళల భద్రతే మన లక్ష్యం. వారి భద్రతకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పని చేయాలి” అని ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు.మహిళలు తమ సమస్యలను సపోర్ట్ సెంటర్‌లో నేరుగా తెలియజేయవచ్చు అని, అత్యవసర పరిస్థితుల్లో, టోల్‌ఫ్రీ నంబర్లు 112 లేదా 1098 లేదా 1930లకు కాల్ చేయవచ్చు అన్నారు. ఈ సెంటర్ ద్వారా మహిళలకు అవసరమైన న్యాయం చేయడానికి కృషి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి డి శ్రావణ్ కుమార్,మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యమ్ సుబ్బారావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై కాంతి ప్రియ, ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ వై వి రమణ, ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాష, ఏలూరు 2 టౌన్ ఎస్ఐ రామకృష్ణ, భూమిక మహిళల సామూహిక చీఫ్ ఫంక్షనరీ, శ్రీమతి కొండవేటి సత్యవతి, కౌన్సిలర్ నాగా సుజీ డాక్టర్ వి మనోహరి, గ్రామా డీప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఎ లక్ష్మి, ఆర్టీడి జిల్లా న్యాయమూర్తి, శ్రీమతి మదావి లత , ఆశా జ్యోతి అసమమ్, నిరామాలా, వన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మా పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చండి అని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి దోసలుడికి గ్రామస్థులు వినతి



**గుంతకల్ ప్రజా జ్యోతి:** అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం గుంతకల్లు మండలం దోస లుడికి గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు తమ ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా అభివృద్ధి చేయవలసిందిగా గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కి వినతి పత్రం సమర్పించడం జరిగింది, ఈ సందర్భంగా గ్రామస్తుల తరపున %ఙచీూఖీ% ఉపాధ్యక్షులు బండారి పురుషోత్తం ఎమ్మెల్యే తో మాట్లాడుతూ ప్రస్తుతం మా గ్రామంలో 6,7, 8 తరగతిలో 53 మంది పిల్లలు ఉన్నారని కాబట్టి ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చేందుకు అవకాశం ఉన్నందున తమని అభ్యర్థిస్తున్నామని ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆరు ఏడు ఎనిమిది తరగతులలో 29 నుంచి 53 మంది పిల్లలు ఉంటే ఆ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా అభివృద్ధి చేయవచ్చు అని ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే కి విన్నవించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే కచ్చితంగా మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా అభివృద్ధి చేసే తట్లు చర్యలు తీసుకుంటామని తెలిపినారు

# శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానం నందు అఖిలాండకోటి బ్రహ్మాండ ప్రథమ వార్షికోత్సవ మహా వైభవం గా కన్నుల పండగ





**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి:** కసాపురం శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నందు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు అది దేవుని ప్రథమ వార్షికోత్సవం మహా వైభవంగా కనుల పండుగగా స్వామి అమ్మవార్లకు సుదర్శన మూర్తి వారి చక్కర స్నానం వివిధ పూలతో అర్చన సేవ తో 5 రోజుల ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు అనంతరం ఆలయ అర్చకులు నందకిషోర్ రాకేష్ చెన్నకేశవ స్వాములు మాట్లాడుతూ ఈ 5 రోజులు స్వామి అమ్మవార్లకు జరిగిన పూజా విశేషాలు 9వ తేదీ ఆలయకర్త తలారి పరుశు రాముడు శకుంతలమ్మ దంపతులచే వారి ఇంటి నుండి స్వామివారికి పట్టు వస్త్రాలు సన్నాయిమంగళ వాయిద్యాలతో తీసుకురావడం మొదలుకొని అగ్నిహోత్ర హోమము హయగ్రీవ సరస్వతి హోమాలు పిల్లలకు నాలుకపై బీజాక్షర మంత్రం రాయటం మహా సుదర్శన స్వామి 108 నవ కలశ పూజలు స్వామివారి పల్లకి సేవలు విశ్వశాంతి కై శ్రీ లక్ష్మీనారాయణ స్వామి శాంతి కళ్యాణాలు గరుడ వాహనంపై స్వామి అమ్మవార్ల కసాపురం గ్రామం సీతారాముల ఆలయం వరకు రథోత్సవం నేడు సుదర్శన నరసింహ స్వామి వారి కి చక్కెర స్నానం
కుంకుమార్చన ఆయన ఆలయ స్టాఫ్ భక్తులు ఆనందోత్సవాలతో వసంతోత్సవాలతో నేటితో ప్రథమ వార్షికోత్సవం వేడుకలు ముగిసినది అనంతరం తలారి పరుశు రాముడు మాట్లాడుతూ 5 రోజులు ప్రథమ వార్షికోత్సవం ఘనంగా ఆనందంగా ఆ సంతోషంగా బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా స్వామి అమ్మవారి ఆశీస్సులు పొందిన భక్తులు ప్రజలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు
ఈరోజు దైవ పుణ్య కార్యాలకు
దేవస్థానం అభివృద్ధి అన్న ప్రసాద వితరణకు విరాళాలు అందించిన పెద్దలు గుంటకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి పట్టణ ప్రముఖులు పెట్రోల్ బంక్ దేవేంద్రప్ప గవర్నమెంట్ హాస్పిటల్
డాక్టర్ శివాని మేడంకు గతంలో విరాళాలు రూపంలో స్వామి అమ్మవారి సేవకు ముందుకు వచ్చిన భక్తులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆలయ ట్రస్ట్ ద్వారా తెలియజేస్తున్నాం
అలాగే ఈరోజు తిరుమల తిరుపతి హరీ రామ్ బాబా మఠం నుండి సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకుని వివిధ క్షేత్రాలను దర్శించి పావిడ తీసుకొని ఈరోజు శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దర్శించి స్వామి అమ్మవార్ల పాద సేవ చేసుకొని గుండాల తాండాకు చెందిన గణపతి స్వామి వారి కుటుంబ సభ్యులు సంత్ సేవాలాల్ మహారాజ్ 15వ తారీకు జరుగు వెళ్లడం జరిగినది
ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ తేజ సౌమ్య ఆలయ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు ఆలయ స్టాఫ్ శివరత్నం మురళి మల్లికార్జున స్వామి శశికళ నాగవేణి సేవకులు పాల్గొనడం జరిగినది

# మూడు నెలల్లో ఆటోనగర్‌లో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్

**ఆటో మొబైల్ అసోసియేషన్స్ తో సమావేశం**

**విజయవాడ వెస్ట్ ప్రజా జ్యోతి రిపోర్టర్ చంద్రశేఖర్** ఆటోనగర్ లో ఆటో మొబైల్ రంగం పై ఆధారపడి జీవిస్తున్న లక్షమంది కార్మికులకి మారిన టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకునేందుకు కావాల్సిన స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఆటోనగర్ లోనే మూడు నెలల్లోనే ఏర్పాటు చేయిస్తానని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఆటోనగర్ లో వున్న 32 ఆటో మొబైల్ అసోసియేషన్స్ నాయకులతో ఎంపి కేశినేని శివనాథ్ సమావేశం అయ్యారు. అసోసియేషన్స్ పరంగా డెవలప్ కావటానికి ఏమి కావాలో అడిగి తెలుసుకున్నారు. అలాగే అసోసియేషన్స్ క్లస్టర్స్ గా ఏర్పడితే కలిగే ప్రయోజనాలు, కేంద్రప్రభుత్వం అందించే సబ్సీడి వివరాలు తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నుంచి నిడమానురు వరకు ఫ్లైఓవర్ పనులు, అలాగే మెట్రో పనులు ప్రారంభమైన ఆటోనగర్ లోకి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు నెలల్లో జెట్ స్పీడ్ లో అమరావతి పనులు జరగనున్నాయని, ఆ పనులకు ట్రాన్స్ పోర్ట్ చాలా కీలకం..కాబట్టి ఆటో మొబైల్ రంగం ఇందుకు సిద్దంగా వుండాలన్నారు. ఆటోనగర్ కి వున్న చిన్నచిన్న సమస్యలు కూడా త్వరలోనే ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. ఆటో మొబైల్ రంగంలో వున్న అసోసియేషన్స్ లో వున్న నాయకులు క్లస్టర్స్ గా ఏర్పడాలని సూచించారు. క్లస్టర్స్ గా ఏర్పడితే సంబంధిత అధికారులతో మాట్లాడి లోన్ వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.క్లస్టర్స్ ఏర్పాటుకి సంబంధించిన స్థలం విషయంలో కూడా సాయం చేస్తానని తెలిపారు. ఆటోనగర్ సిల్క్ డెవలప్మెంట్ సెంటర్స్ ద్వారా అప్ గ్రేడ్ చెంది, క్లస్టర్ ఏర్పాటు చేసుకుని అభివృద్ది చెందితే ఎంతో మందికి ఉపాది కల్పించే అవకాశం



వుంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక మంది యువతకి ఉపాధి చూపించటమే తన ధ్యేయమని..ఆటో మొబైల్ రంగానికి రాబోయే కాలంలో మంచి భవిష్యత్తు వుంది...అందుకు తగ్గట్టుగా ఆటోనగర్ వర్కర్స్ అందరూ టెక్నికల్ గా అప్ గ్రేడ్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసిసోయేషన్ ప్రెసిడెంట్ నాగమోతు రాజా, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంధం వెంకటేశ్వర్లు (కొండ), ఎఫ్.ఐ.పి ప్రెసిడెంట్ నెల్లి వెంకటేశ్వరరావు, పెయింటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరాచారి, టైర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాబా, టింకరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చమట పూర్ణ, ఐలా కో-ఆప్షన్ సభ్యులు బాహుబలేంద్ర కోటేశ్వరరావు, హెచ్.ఎమ్.సి మినీ ట్రక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అసీఫ్ భాషా, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంపర చిన్నారావు, రెడియేటర్స్ యూనిట్ ప్రెసిడెంట్ షేక్ హీదాయుతుల్లా, ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబ్దుల్ కలాం, ఎలక్ట్రికల్ బ్యాటరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవ, కె.హరి, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్స్ కొడూరు ఆంజనేయ వాసు లతోపాటు పలు అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొననారు.

# ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు కు చర్యలు..

జిల్లా కలెక్టర్ ప్రశాంతి..
ఆరోగ్యవంతమైన పంటల సాగు లక్ష్యం..

**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలో ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య వంతమైన పంటల సాగు లక్ష్యంగా అడుగులు వెయ్యాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు.స్థానిక కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రకృతి వ్యవసాయ రైతుల అభిప్రాయాలను పంచుకున్నారు. తొలుత ప్రకృతి వ్యవసాయం చేద్దాం అన్న ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, మనం తీసుకునే ఆహారం ఆరోగ్యవంతంగా, ప్రయోజన కరంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా పండించే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసే బాధ్యత కూడా మనదే అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన రైతుల అభిప్రాయాలు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసే క్రమంలో మూడు సంవత్సరాలు పాటు ఓపికగా ఉంటే ఎరువులు ద్వారా పండించే పంటలకు దీటుగా దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. భూమిని పరిరక్షించే బాధ్యత మనదే అని, పురుగుల మందులు, ఎరువులు వాడి భూసారాన్ని




కలుషితం చేస్తున్నామని, భూమిని పరిరక్షించే దిశగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో మేలు చేస్తుందని, భవిష్యత్తు తరాలకు మంచి ఆహారం అందించడం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. 2 వేల సంవత్సరంలో సత్యమేవ జయతే కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సెర్ప్ ద్వారా దేశానికి అందించిన సందర్భాన్ని కలెక్టర్ వివరించారు. ప్రకృతిని పరిరక్షించే విధంగా సాయిల్ వెస్ట్, లిక్విడ్ వెస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని అమలు చేసి, వాటి ద్వారా సహజ వనరులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంద న్నారు. కాలుష్యం కారణంగా నిలిచే వాటిని అవసరం కోసం వినియోగించే దిశ నుంచి అలవాటుగా మార్చుకున్నామని తెలిపారు. ఎరువులు పురుగుల మందులతో కూడిన విషతు ల్యమైన రసాయనాలను ఉపయోగించిన ఆహార పదార్థాలు కారణంగా క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి రైతు భూమిని కాపాడుకునే ప్రయత్నం చేయాలని, దశల వారీగా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. లాభాపేక్షతో కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అడుగులు వేస్తున్న రైతులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం పై ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఓపిక ఉండాలని, పురుగులు మందులు ఎరువులు ద్వారా సాగు చేసే దిగుబడి కి సమానంగా దిగుబడి సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ బి సుజాత కుమారి, కేవీకే సమన్వయకర్త శాసవేత్త డా. యు ఎస్ గోపాల్ నాయుడు, ప్రకృతి వ్యవసాయ డిపిఎం తాతా రావు, డిఆర్ డి ఏ పిడి ఎన్ వివిఎస్ మూర్తి, ప్రకృతి వ్యవసాయ సాగు చేసే రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవములో బొండా ఉమ





**విజయవాడ వెస్ట్ ప్రజా జ్యోతి రిపోర్టర్ చంద్రశేఖర్** ది:-13-2-2025 గురువారం మధ్యాహ్నం12:30"గం లకు " సెంట్రల్ నియోజకవర్గంలోని పాయకాపురం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం నందు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య కళ్యాణం సందర్భంగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో 1000 మంది భక్తులకు అన్నదానం తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేయడం జరిగినది... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా :- ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వర పాల్గొని ముందుగా తిరుపతమ్మ గోపయ్య దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది... ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ:- స్వామివారు, అమ్మవార్ల కల్యాణ మహోత్సవంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, ఆ స్వామి వారు, అమ్మవార్ల కృప మన అందరి పై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు, కనకదుర్గమ్మ వారి దర్శనం చేసుకుని, అమ్మవారి ఆశీర్వాదాలను తీసుకుని, ప్రజలందరినీ ఎటువంటి కష్టాలు రాకుండా కాపాడాలని ప్రార్థించి, అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ సెంట్రల్ నియోజకవర్గం పై ఉండాలని వేడుకుని వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించడం చాలా సంతోషంగా ఉన్నదని ఈ సందర్భంగా బొండా ఉమా తెలియజేశారు... ఈ కార్యక్రమంలో:- దేవస్థానం కమిటీ వారు, లబ్బా వైకుంఠం, బత్తుల కొండా, కోలా శ్రీను, మోదుగుల గణేష్, కాసిమ్, పైడి శ్రీను, పెద్ది శ్రీను, లబ్బా దుర్గ, దాసరి ఉదయశ్రీ, తదితరులు పాల్గొన్నారు...

## తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 35 మంది పోటీ..

**ఏలూరు, ఫిబ్రవరి, 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో గురువారం 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి 54 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వివిధ కారణాలతో 11 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించగా, మరో 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో 35మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది

## అమర్తలూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ






**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కేసుల విచారణ వేగవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు జిల్లా ఎస్పీ గురువారం అమర్తలూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాల గురించి ఆరాతీశారు విచారణ దశలో వున్న కేసుల దర్యాప్తు పరిశీలించి వేగవంతంగా దర్యాప్తు సాగించడానికి మెళకువలను తెలిపారు పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు శాఖ పరంగా ఉన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని ఎస్పీ తెలిపారు స్టేషన్ పరిధిలో ఉన్న పాత నేరస్తులు రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు గ్రామస్థాయిలో పటిష్టమైన నిఘా వుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటే వారి సమాచారాన్ని సేకరించుకొని విచారించాలని సూచించారు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే మృత్యువాత పడుతున్నారన్నారు దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు కనుక ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు నేరాలు ఛేదించడంలో నియంత్రించడంలో సీసీ కెమెరాలు పాత్ర కీలకమన్నారు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఒక్క గ్రామంలో కూడళ్లలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు దొంగతనాలు ఇతర ప్రాపర్టీ నేరాలను నియంత్రించడానికి గస్తీని ముమ్మరం చెయ్యాలని అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి నిర్మానుష్య ప్రాంతాలలో ముఖ్యమైన ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో పల్లెనిద్ర ఇతర కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్న తీరును గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు శివరాత్రికి గోవాడ తిరునాళ్ళకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దేవస్థానంలో చుట్టుపక్కల ప్రాంగణాలలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు చుండూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అమర్తలూరు ఎస్ఐ ఇతర పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# డ్రోన్ ల నిఘాలో గోవాడ తిరునాళ్ళ

**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** శివరాత్రి పండుగ సందర్భంగా దేవస్థాన పరిసర ప్రాంతాలలో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని దానికోసం సీసీ కెమెరాలు డ్రోన్లను వినియోగించనున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు ఫిబ్రవరి 13న గురువారం బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఎస్పీ సందర్శించారు ఫిబ్రవరి 26న శివరాత్రి పండుగ సందర్భంగా తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లను గురించి స్థానిక అధికారులతో ఆలయ నిర్వాహకులతో విస్తృతంగా చర్చించారు బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు గోవాడ తిరునాళ్ళలో శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానముకు దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు దర్శనానికి విచ్చేసే భక్తులకి ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా రేపల్లె డిఎస్పి సారథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు వాహనాల పార్కింగ్ కి విశాలమైన ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు ఆలయానికి వచ్చే వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు క్యూ లైన్ లలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నామన్నారు దొంగతనాలు జరగకుండా నివారించేందుకు మఫ్టీలో ఎక్కువ సంఖ్యలో పోలీసులను నియమిస్తున్నామని పేర్కొన్నారు ఆలయ ప్రాంగణం సంస్కృతిక కార్యక్రమాలు జరిగే ప్రదేశాలలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు శివరాత్రి రోజున దేవాలయం చుట్టుపక్కల ప్రాంగణాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తిస్థాయి



నిఘా ఉంచేందుకు డ్రోన్ల ను వినియోగించుకున్నామని తెలియజేశారు దేవాలయంలోకి భక్తులు ప్రవేశించే మార్గం బయటికి వచ్చే మార్గం వేరువేరుగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ చుండూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ అమర్తలురు ఎస్ఐ ఆలయ అధికారులు ఇతరులు పాల్గొన్నారు

## ఘనంగా శ్రీ షిరిడి సాయి 9వ వార్షికోత్సవ పూజలు

**రాప్తాడు, ఫిబ్రవరి 12:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న బీసీ కాలనీలో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా 9వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఇందులో భాగంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం షిరిడి సాయి ఆలయం ఎదుట భజన బృందం ఆలపించిన పాటలు అహూతులను అలరించాయి.

## అసెంబ్లీలోలి బడ్జెట్ సమావేశాలపైచర్చిస్తున్నమంత్రి

పయ్యావులకేశవ్



**విజయవాడ ఫిబ్రవరి 13:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా గురువారం అమరావతిలోని సచివాలయంలో ముందస్తుగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఆ శాఖ అధికారులతో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు.

## ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలంలో సిమెంట్ రోడ్ల ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్.



**ధర్మవరం ఫిబ్రవరి 13:** ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్లను మరియు పత్యపురాం గ్రామంలో కొత్తగా సిమెంట్ రోడ్లను వేటకు శంకుస్థాపన చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రివర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి సత్య కుమార్ యాదవ్, ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, నేటి ఈ సిమెంట్ రోడ్ల నిర్మాణం వలన, గ్రామస్థులకు మంచి రోడ్డు మార్గం, సులభమైన రవాణా సౌకర్యం లభించి, వారి జీవితాలు మరింత సౌకర్యవంతంగా మారుతాయి, అలాగే వచ్చే రోజుల్లో ఇలాంటి మరిన్ని అభివృద్ధి పనులు కొనసాగిస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, ఆర్డీవో మహేష్, బత్తలపల్లి ఎంపీడీవో, ధర్మవరం పట్టణ అధ్యక్షులు, డి చెర్లోపల్లి నారాయణస్వామి, డోల రాజారెడ్డి,రూరల్ అధ్యక్షులు గోట్లురు చంద్ర,తాడిమర్రి మండల అధ్యక్షుడు దేవర రాము, బత్తలపల్లి అధ్యక్షుడు ఆకులేటి భాస్కర, బిజెపి నాయకురాలు లీలావతి, జింక రామాంజనేయులు, బోయ పెద్దలింగమయ్య బ్రదర్స్, బిజెపి నాయకులు కృష్ణాపురం జమీర్ అహ్మద్,అంగజల రాజు, బిజెపి మహిళా నాయకురాలు, మరియు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమ గురించి వివరించిన డిజైనర్ జుజారు నాగరాజు

**ధర్మవరం ఫిబ్రవరి 13:** పుట్టపర్తి లోని శ్రీ సత్య సాయి ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్ కి సత్య సాయి జిల్లాలోని లోని చేనేత పరిశ్రమ గురించి ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్ జుజారు నాగరాజు.ధర్మవరం పట్టు చీరల ఖ్యాతి గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు సత్యసాయి జిల్లా హ్యాండ్లూమ్స్ ఏ డి. రామకృష్ణ ఆప్ కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రా భద్రాద్రి క్షేత్రానికి ఉడతా వీరభద్రరావు 25 వేల రూపాయలు విరాళం



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని వివేకానంద కొండపై దాతల సహకారంతో నూతనంగా నిర్మితమవుతున్న ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన నిర్మాణానికి ప్రముఖ వ్యాపార వేత్త పచ్చారి సూర్య ప్రసాద్ ప్రోత్సాహంతో పిఠాపురం మండలం ఉప్పాడ కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ బట్టల వ్యాపారి ఉడతా వీరభద్రరావు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు 25 వేల రూపాయలు అందించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గోగుల వెంకటేశ్వరరావు,పత్రి రమణ తదితరులు ఆయనని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పత్రి రమణ మాట్లాడుతూ ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర నిర్మాణానికి తన వంతు సహాయం అందించిన దాత ఉడతా వీరభద్రరావు,వారి కుటుంబ సభ్యులకు శ్రీరాముని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.విరాళ దాత ఉడతా వీరభద్రరావు మాట్లాడుతూ ఈ క్షేత్ర నిర్మాణంలో నేను ఉడత భక్తిగా సహాయం అందించడమే కాకుండా విరాళాల సేకరణ చేసి క్షేత్ర నిర్మాణంలో భాగస్వామ్యం అవుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ సేవక్ సభ్యులు నేతి శ్రీనివాసరావు,నాగ ఆంజనేయులు,కీర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చిక్కును అందజేసిన ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల నియోజకవర్గం పిట్టలవాని పాలెం మండలం సంగుపాలెం గ్రామానికి చెందిన కనిగంటి అరుణ కుమారికి వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన రూ 2,50,046 చెక్కును లబ్ధిదారులకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు ఈ కార్యక్రమంలో కోటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గుత్తి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న , ఎమ్మెల్యే ఉగ్ర, మాజీ ఎమ్మెల్యే కదిరి, దారపనేని, బైరెడ్డి

**కనిగిరి ఫిబ్రవరి 13 :** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని బాలాజీ జ్యువెలర్స్ అధినేత గుత్తి వెంకటరాజా ధర్మపత్ని శ్రీమతి బుజ్జమ్మ దంపతుల ఏకైక కుమారుడు అనిల్ కుమార్, కొత్తపట్నం వాస్తవ్యులు సుంకరి రాంబాబు, ధర్మపత్ని శ్రీమతి అంజలి దంపతుల కుమార్తె లక్ష్మి యశస్విని ల వివాహ వేడుకలు పామూరు పట్టణంలోని పువ్వాడి కన్వెన్షన్ హాలులో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో కనిగిరి శాసనసభ్యులు, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు, టిడిపి నాయకులు కోటపాటి జనార్దన్ రావు,కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, మోపాడు తెలుగుదేశం నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, కనిగిరి బిజెపి నియోజకవర్గ కన్వీనర్

## కుంభమేళాలో ముదునూరి



**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమం వద్ద ఈ మహా కుంభమేళా లో పాల్గొన్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు మాజీ జెడ్పిటిసి ముదునూరి లోవలక్ష్మి రాజు

## ఎమ్మెల్సీ అవగాహన సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యప్రభ



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు నియోజకవర్గము శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు ప్రత్తిపాడు టిడిపి కార్యాలయంలో నిర్వహించారు ఈ అవగాహన సదస్సులో నియోజక వర్గ జనసేన అధ్యక్షులు వరుపుల తమ్మయ్య బాబు నియోజక వర్గ ప్రత్యేక పరిశీలకులు గొంప కృష్ణ నియోజక వర్గ పరిశీలకులు ఎన్డీఏ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ప్రత్యేక పరిశీలకులు గొంప కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు లాంటి దూరదృష్టి గల నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం ఉన్నందు వల్లే సంక్షోభం లో ఉన్న రాష్ట్రం సంక్షేమము వైపు అడుగులు వేస్తుంది అన్నారు మరో పరిశీలకులు మెట్ల రమణబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరు కి రిఫరెండం గా ఉంటుందని అన్నారు కావున ప్రతీ ఒక్కరూ శ్రమించాలని కోరారు నియోజక వర్గ జనసేన అధ్యక్షులు వరుపుల తమ్మయ్య బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు ఎమ్మెల్సీ ఓటర్లు అందరూ కూటమి ప్రభుత్వం నకు మద్దతుగా ఉండాలని కోరారు ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖరం కి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేలా నియోజకవర్గ ఎన్డీఏ కూటమి శ్రేణులు కృషి చేయాలని కోరారు. ప్రచారం నిర్వహించడం లో సాంకేతికతను వినియోగించుకోవాలి అన్నారు.. కార్యక్రమంలో ఎన్డీఏ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు శివకేశవుల ప్రతిష్ట మహోత్సవంలో ప్రత్యేక పూజలు





**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి,శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి శివకేశవులు కొలువైన క్షేత్రంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు,తోట సర్వారాయుడు సునీత దంపతులచే 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగుతున్న శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మొదటిరోజు వెంకటేశ్వర స్వామి వారికి శ్రీ వైఖానస భగవత్ శాస్త్ర ప్రకారంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన,అకల్మష హోమం,నవగ్రహారాధన ,యాగశాల వాస్తుశుద్ధి, ఆచార్యాది ఋత్విక్ వరుణ దీక్షాధారణ,అంకురార్పణ, యాగశాల ప్రదేశం జరిగాయి.పరమశివుడికి ఉదయం వినాయక పూజ, పుణ్యాహవాచనం,మండప పూజలు,శ్రీ రుద్రాభిషేకం, రుద్ర సహిత చండీ హోమం, నీరాజనా మంత్రపుష్పాలు సాయంత్రం రుద్రహోమం, చండిహోమం, దేవతాహోమాలు, నిరంజనమంత్రపుష్పాలు దర్బారుసేవ,బ్రహ్మశ్రీ శ్రీమాన్ పాణింగపల్లి సత్య పవన్ కుమార్ ఆచార్యులు, కొత్ర వెంకట సూర్య కామేశ్వర శర్మ పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఫిబ్రవరి 17వ తేదీ 11 గంటల 55 నిమిషాలకు శివకేశవుల ప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.ఈ కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివ కేశవులను దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

## కిర్లంపూడి మండలంలో వ్యవసాయాధికారుల పర్యటన



**కిర్లంపూడి ప్రజా జ్యోతి రిపోర్టర్ రవి** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో సింహాద్రిపురం, జగపతినగరం గ్రామాలలో ఎన్ఎఫ్ఎస్ఎం సిడి సిఎస్బిడి ప్లాట్లను డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి వి ఎస్ సి హరి,అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పి మాధవి పరిశీలించారని ఏవో జోకా అమృత తెలిపారు.రైతులతో అపరాల యొక్క ప్రాధాన్యత గురించి,అపరాల్లో ఏ విధంగా దిగుబడి తీసుకురావాలో వాటి గురించి రైతులకు తెలియజేశారని ఏవో జోకా అమృత తెలిపారు.జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో రైతులకు ప్రయోగాత్మకంగా సిడి సి ఎస్ బి డి ప్లాట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.విత్తనాలు,టి.విరిడ్,పి ఎస్ బి,కలుపు మందులు,పురుగుమందులు,50 శాతం సబ్సిడీపై రైతులకు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.అపరాల్లో వేసే రైతులకు ప్రభుత్వ ప్రోత్సహకాలు ఇచ్చి అపరాల సాగుకి ప్రాధాన్యత ఇస్తుందని తెలియజేశారు

# ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుంది




- పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ ను అందిస్తున్నాం
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- నలుగురు లబ్ధిదారులకు 9లక్షల 74వేల చెక్కులు అందజేత

**అనంతపురం ఫిబ్రవరి 13:** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోవైద్యపరంగా ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని.. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో పలువురికి ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లికి చెందిన చీమల తిప్పన్నకు ఒక లక్ష 76వేలు 683 రూపాయలు, మేడాపురంకి చెందిన రాజేంద్రప్రసాద్ కు 3లక్షల 99వేలు, పెద్ద మొగలాయపల్లికి చెందిన లింగమయ్యకు 2లక్షల 55 వేల 524రూపాయలు, రామగిరి మండలం కలికివాండ్లపల్లికి చెందిన యనుమల పోతులయ్యకు ఒక లక్షా 43 వేల 760 రూపాయలు చొప్పున మొత్తం 9లక్షల 74 వేల 982రూపాయల చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ప్రజలకు అత్యవసరమైన విద్యా, వైద్యసేవల్లో రాజకీయాలు ఉండవని.. అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం పథకాలు తప్పనిసరిగా అందిస్తామన్నారు....

# డి.సి.హెచ్.ఎస్ పై విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి

అంకుశం ప్రతినిధి పరిశోధనాత్మకమైన కథనంలో ఆసక్తికర విషయాలు వెలుగు చూసాయి




**అనంతపురం ఫిబ్రవరి 13:** అనంతపురం డిసిహెచ్ఎస్ కార్యాలయం మరియు అధికారి డాక్టర్ వి పాల్ రవికుమార్ అవినీతి పై ప్రజా సంఘాలు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాల నాయకులు రాతపూర్వక ఫిర్యాదులపై రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఏ.సిరి, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంయుక్తంగా తాడేపల్లిలోని ఏపీ స్టేట్ ఎయిడ్స్ అండ్ కంట్రోల్ లెప్రసీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్ ఈ నెల 11, 12 తేదీలలో రెండు రోజులపాట అనంతపురం డిసిహెచ్ఎస్ కార్యాలయంలో సమగ్ర విచారణ జరిపారు వారములోగా రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేయాల్సిందిగా ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రెండు రోజులు పాటు సాగిన విచారణలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి ముఖ్యంగా ఎవరైతే ఫిర్యాదు చేశారో ఆ ఫిర్యాదుదారున్ని కార్యాలయ సిబ్బంది ఒకచోట గదిలో ఉంచి విచారణ అధికారి వై కామేశ్వర్ ప్రసాద్ వద్దకు మరియు డిసిహెచ్ఎస్ కార్యాలయం దరిదాపులకు రానీయకుండా చేసినట్లు అలాగే ఫిర్యాదుదారునికి వ్యతిరేకంగా ఉండే యూనియన్ నేతలతో విచారణాధికారికి ఫిర్యాదుదారునిపై వ్యతిరేకంగా రాతపూర్వక ఫిర్యాదులు చేయించినట్లు విశ్వసనీవర్గాల సమాచారం ఒక దశలో విచారణాధికారిని తాడేపల్లి నుంచి అనంతపురానికి రానీయకుండా డిసిహెచ్ఎస్ రాజకీయ వర్గాల ద్వారా ఒత్తిడీలు తెచ్చినట్లు సమాచారం అందింది నిజాయితీపరుడైన విచారణ అధికారి వై.కామేశ్వర ప్రసాద్ రెండు రోజులు పాటు డిసిహెచ్ఎస్ కార్యాలయంలోనే మకాము వేసి పలు రికార్డులను పరిశీలించి డిసిహెచ్ఎస్ అధికారి డాక్టర్ వి.పాల్ రవికుమార్ ని పలు ప్రశ్నలు సంధించి వాటికి లిఖితపూర్వక సమాధానాలు రాయించుకున్నట్లు తెలిసింది అలాగే కార్యాలయ సిబ్బంది క్లర్కులు పవన్ కుమార్ అలియాస్ ఎర్రి స్వామి మరియు పి పద్మావతి వారి పై వచ్చిన అవినీతి ఆరోపణల పైన లిఖితపూర్వక సమాధానాలు ప్రశ్నలు సంధించి వాయిస్ రికార్డుల మేరకు విచారణ అధికారి వద్ద ఉన్న సమాచారం మేరకు క్లుప్తంగా రాబట్టినట్లు తెలిసింది విచారణ అధికారి వై.కామేశ్వర ప్రసాద్ చేసిన విచారణకు డిసిహెచ్ఎస్ వి. పాల్ రవికుమార్ కు మరియు కార్యాలయ సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి గురువారం నాడు అనంతపురం నుంచి విలేకరులు విచారణాధికారికి ఫోన్ ద్వారా సంప్రదించగా విచారణాధికారి వై.కామేశ్వర్ ప్రసాద్ విచారణ బయటికి బహిర్గతం చేయడానికి వీలులేదని సమగ్రమైన రిపోర్టును తయారు చేసి వారం రోజుల్లో ఉన్నతాధికారులకు మరియు విచారణ కార్యదర్శి ఇచ్చిన అధికారులకు అందజేస్తామన్నారు మంగళవారం బుధవారం విచారణ అధికారిని కలవడానికి వెళ్లిన అనంతపురం విలేకరులకు డిసిహెచ్ఎస్ కార్యాలయ సిబ్బంది తప్పుధావ పట్టించి బుధవారం సాయంకాలం నాలుగున్నరకు విచారణ అధికారి విలేకరులతో మాట్లాడతారని తెలిపి మధ్యాహ్నం రెండు గంటలకే విచారణ అధికారిని వేరే మార్గంలో పంపించడం కోసమెరుపు వాస్తవానికి విచారణ అధికారి డిసిహెచ్ఎస్ మరియు కార్యాలయ సిబ్బంది మీద చర్యలు తీసుకుంటారో లేదో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

**ఫిర్యాదుదారునిపై భౌతిక దాడి, కేసు నమోదు**

అనంతపురం డిసిహెచ్ఎస్ కార్యాలయంలో విచారణ జరిపేందుకు తాడేపల్లి నుంచి డాక్టర్ వై కామేశ్వర ప్రసాద్ వస్తున్నారన్న సమాచారాన్ని నిర్ధారణ చేసుకున్న డిసిహెచ్ఎస్ అధికారి వారి కార్యాలయ సిబ్బంది ఏకమై ఒక పథకం ప్రకారం ఫిర్యాదుదారుడు పైన భౌతిక దాడి చేసి, కుట్ర బన్నీ అనంతపురం టు టౌన్ పోలీస్ స్టేషన్ కు డిసిహెచ్ఎస్ డాక్టర్ వి.పాల్ రవికుమార్ స్వయంగా వెళ్లి తనవిధులకు ఆటంకం కలిగించాడని మోసపూరితమైన ఫిర్యాదు అందజేసి ఫిర్యాదుదారుడుపై కేసు నమోదు చేయించి ఫిర్యాదుదారున్ని భయభ్రాంతులకు గురిచేసినట్లు విశ్వసనీయ సమాచారం

# అనంత కు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని తీసుకొస్తాం




బడ్జెట్ సమావేశాల్లో దీని గురించి చర్చిస్తాం..అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

750 కోట్లతో అండర్ గ్రౌండ్ డైనేజి కి ప్రతిపాదనలు

**అనంతపురం ఫిబ్రవరి 13:** అనంతపురం జిల్లా అనంతపురం కార్పొరేషన్ పరిధిలోఅనంతపురం నగరానికి త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం ఆర్.అండ్.బి అతిథి గృహంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పై చర్చించనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. నగరంలో పరిస్థితులు, ప్రస్తుతం డ్రైనేజీ వ్యవస్థ ఉన్న తీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకత వంటి వాటి గురించి చర్చించారు. ఇది నిర్మించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 750 కోట్ల రూపాయలతో నగరంలో అండర్ గ్రౌండ్ డైనేజి కి ప్రతిపాదనలు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాజాగా బడ్జెట్ సమావేశాల్లో కూడా దీని గురించి చర్చిస్తామన్నారు. త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

## ఉపాధి హామీ కూలీలకు అదనంగా 50 రోజులు



**రాప్తాడు, ఫిబ్రవరి 12:** గతేడాది ఖరీఫ్ సీజనులో సరైన సమయంలో వర్షాలు కురవక రైతులు సాగుచేసిన పంటలకు పెట్టిన పెట్టుబడులు చేతికందక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాప్తాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించింది. రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడకుండా ఉపాధి హామీ పథకం కింద అదనంగా 50 రోజుల పనిదినాలను కల్పించిందని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి గురువారం తెలిపారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలు అదనంగా కేటాయించిన ఈ 50 రోజులను కూలీలు మార్చి 31వ తేదీ లోపు వినియోగించుకోవచ్చన్నారు.

## ఫిబ్రవరి 15న కపిలేశ్వరస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి ఫిబ్రవరి 13:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలో ఫిబ్రవరి 19 నుండి 28వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం విదితమే. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం, అలంకారము, శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఈ కారణంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.

## పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

తాడిమర్రి మండలంలో పలువురు నేతలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్న శ్రీరామ్



**ంంఅనంతపురం ఫిబ్రవరి 13:** శ్రీ సత్య సాయి జిల్లాలోనిధర్మవరం నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పని చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు. తాజాగా తాడిమర్రి మండలం మరవపల్లి గ్రామానికి చెందిన పలువురు శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరారు. కిషోర్,లక్ష్మి నారాయణ అధ్వరంలో వైసీపీ పార్టీ కి చెందిన 30 కుటుంబాలవారు అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరందరికీ శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో పని చేయాలన్న ఉద్దేశ్యంతో పార్టీలో చేరినట్టు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేడు అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తోందన్నారు. అందుకే అంతా తెలుగుదేశం పార్టీతో కలిసి పని చేసేందుకు ముందుకొస్తున్నారని అన్నారు....

## ఆటోనగర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్

- ఆటోమొబైల్ ఇండస్ట్రీ పారిశ్రామికవేత్తలతో ఎంపీ కేశినేని శివనాథ్





**విజయవాడ, ఫిబ్రవరి 13):** ఆటోమొబైల్ ఇండస్ట్రీయల్ లో మారిన సాంకేతికతను అందిపుచ్చు కుని అప్ గ్రేడ్ అయ్యేందుకు ఆటోనగర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీ అసోసియేషన్ సభ్యులతో గురునానక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆటోనగర్ లోని ఆటోమొబైల్ ఇండస్ట్రీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆటోనగర్ లోని ఆటో మొబైల్ రంగంలో ఉపాది పొందుతున్న లక్షమంది వర్కర్స్ మారిన టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్య పరంగా అప్ గ్రేడ్ చేయాలంటే ఏలాంటి వసతులు, సుదుపాయాలు కావాలో అడిగి తెలుసుకు న్నారు. అలాగే యువతకు ఉద్యోగావకాశాలు, ఆటోమొబై ల్ రంగంలో వ్యాపార అవకాశాలు అబివృద్ధి చెందటానికి పారిశ్రామిక వేత్తల నుంచి సూచనలు తీసుకు న్నారు. ఆటోనగర్ పూర్వ వైభవం తీసుకువ చ్చేందుకు, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కలిసి పనిచేద్దామ న్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో యువతకు లక్షల ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీ అసోసియేషన్ సహకారం అందించాలని ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. ఈ సమావేశంలో ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ ప్రెసిండెంట్ బాయన వెంకట రావు, ప్రెసిడెంట్ దోనేపూడి దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎమ్.ఎస్.దుర్గా ప్రసాద్, మాజీ ప్రెసిడెంట్ డాక్టర్.దాసరి రామకృష్ణ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమేష్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు, మాజీ ఐలా ప్రెసిడెంట్ సుంకర దుర్గా ప్రసాద్, జె.ఆర్.డి టాటా ఇండస్ట్రీస్ ఎస్టేట్ సొసైటీ చైర్మన్ వినోద్ బాబు, ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ మాజీ జనరల్ సెక్రటరీ ఎమ్.వి.వి. సత్యనారాయణ, ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ మాజీ జనరల్ సెక్రటరీ గద్దె సాంబశివరావు, జె.ఆర్.డి టాటా ఇండస్ట్రీస్ ఎస్టేట్ ఐలా సొసైటీ సెక్రటరీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వేమూరి సామ్రాట్ కుమార్ లతో పాటు ఎ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు వేసిన పంట కచ్చితంగా నమోదు చేయాలి.

:సంయుక్త కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, ఫిబ్రవరి 13:** రైతులు వేసిన పంట వివరాలను 'ఈ పంట' నందు కచ్చితంగా నమోదు చేయాలని సంయుక్త కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న ఈ పంట సూపర్ చెక్ లో భాగంగా అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డిలోని ఆ గ్రామ రైతు కే .రవి ,తండ్రి పెద్ద వెంకట స్వామి చెందిన సర్వేనెంబర్ 192-4 లోని1.095 ఎకరాల విస్తీర్ణంలో వేసిన మొక్కజొన్న పంటను సంయుక్త కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు ఈ పంట నందు రైతులు వేసిన పంట వివరములను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అలాగే వారికి వ్యవసాయ శాఖ తరపున అందుతున్న పథకాల గురించి తెలియజెప్పాలన్నారు.రైతులకు ఎరువుల వాడకం గురించి కూడా అవగాహన కల్పిస్తూఎప్పటికప్పుడు రైతులకు అండగా ఉందాలని మండల వ్యవసాయ అధికారిని జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ అధికారి, గ్రామ రెవెన్యూ అధికారి మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచు మోహన్ బాబుకు ముందస్తు బెయిల్

**హైదరాబాద్ :** మంచు ఫ్యామిలీలో జరిగిన వివాదాలను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై దాడి చేసిన కేసులో మంచు మోహన్ బాబుకు ఊరట లభించింది. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత డిసెంబర్‌లో ఆయన నివాసం వద్ద వివాదం చెలరేగింది. చిన్న కుమారుడు మంచు మనోజ్ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. గేట్లు తోసుకొని లోనికి చొచ్చుకెళ్లారు. ఆయనతోపాటు మీడియా ప్రతినిధులు కూడా వెళ్లారు. మీడియా ప్రతినిధులు వెళ్తున్న టైంలోనే అటు నుంచి మోహన్ బాబు రావడం చూశారు. ఆయన వద్దకు చేరుకున్న ఓ మీడియా ప్రతినిధి వివాదంపై ప్రశ్నలు అడగడం ప్రారంభించారు. దీంతో తీవ్ర ఆగ్రహం ఊగిపోయిన మోహన్ బాబు మైకు లాక్కొని దాడి చేశారు. బూతులతో విరుచుకుపడ్డారు. మోహన్ బాబు చేసిన దాడిలో గాయపడిన ఆ మీడియా ప్రతినిధి కేసు పెట్టారు. విధుల్లో ఉన్న తనపై చేయి చేసుకొని గాయపరిచారని హత్యాయత్నం కింద కేసు



పెట్టారు. ఈ కేసులో పలు మార్లు నోటీసులు జారీ చేసిన పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నారు. తెలంగాణ హైకోర్టులో బెయిల్ కోసం ప్రయత్నించి విఫలమైన మోహన్ బాబు సుప్రీంకోర్టు ఆశ్రయించారు. చివరకు అక్కడ ముందస్తి బెయిల్ లభించింది. దాడి చేసిన మోహన్ బాబు మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. చివరకు మీడియాపై ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందో కూడా వివరణ ఇస్తూ లెటర్స్, వీడియోలు, ఆడియో విడుదల చేశారు. వివాదం మరింత ముదిరిపోవడంతో మోహన్‌బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే ఒక రోజు సడెన్‌గా తాను చేసిన దాడిలో గాయపడిన మీడియా ప్రతినిధిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రిలో రిపోర్టర్‌ను పరామర్శించిన మోహన్ బాబు తాను చేసిన దానికి చింతిస్తున్నట్టు చెప్పారు. ఏ సహాయం కావాలన్నా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. రిపోర్టర్ ఫ్యామిలీతో కూడా మాట్లాడారు. జరిగిన దానికి క్షమాపణలు చెప్పారు. కుటుంబంలో జరిగిన వివాదంతోనే ఇలాంటివి జరిగాయని గ్రహించిన పోలీసులు మంచు ఫ్యామిలీకి వార్నింగ్ ఇచ్చారు. రిపీట్ అయితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి టైంలో కూడా తిరుపతిలో మళ్లీ గొడవలు చెలరేగాయి. అక్కడ కూడా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. పోలీసులు జోక్యంత అవి సద్దుమణిగాయి. ః

# రెండు పార్టీల మధ్య కులగణన చిచ్చు

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికార-విపక్షాల మధ్య కులగణన సర్వేపై మాటల యుద్ధం కంటిన్యూ అవుతోంది. బీఆర్ఎస్ కీలక నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్. విపక్ష నేతలు ఆరోపిస్తున్నట్లుగా కులగణనపై తాము చేస్తున్నది రీసర్వే కాదని కుండబద్దలు కొట్టేశారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు రోల్ మాడల్‌గా, మార్గదర్శకంగా సమగ్ర కుటుంబ సర్వే నిలిచిందన్నారు. కొంతమంది తమ సమాచారాన్ని ఇవ్వలేక పోవడంతో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మరోసారి గడువు ఇచ్చినట్టు చెప్పారు. ఈ క్రమంలో 3 శాతానికి పైగా ప్రజలు తమ సమాచారాన్ని ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసిన సందర్భంలో వారికి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దాని తర్వాత మార్చి మొదటివారంలో కేబినెట్ సమావేశం తర్వాత ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.దీనిపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడినట్లుగా ఇదేమీ రీసర్వే కాదన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌కై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని మనసులోని మాట బయటపెట్టారు.బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం సర్వే పాల్గొనకుండా ఆపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు సదరు మంత్రి. కులగణనపై రీసర్వే చేస్తే తాము పాల్గొంటామని కేటీఆర్ చెప్పిన మాటలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేని బీఆర్ఎస్ ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు మంత్రి పొన్నం.కారు పార్టీలో మూడు పదవులు బీసీకి కేటాయించే విధంగా ఎమ్మెల్సీ కవిత చర్యలు తీసుకోవాలన్నారు. కవితక్క మూడు పదవులను బీసీలకు కేటాయించేలా







కరీంనగర్ నుండే ఉద్యమం చేస్తే బాగుంటుందని వెల్లడించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన మీద దుష్ప్రచారం చేయాలని విపక్షాలు చూస్తున్నాయని మండపడ్డారుబీజేపీ వ్యాపారస్తుల పార్టీ, కులగణన, బీసీ, ఎస్సి రిజర్వేషన్లు జరగడం వారికి ఇష్టం లేదని చురక వేశారు మంత్రి పొన్నం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సర్వే తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. బలహీన వర్గాల మీద చిత్తశుద్ధి ఉంటే శాసనసభ ఈ బిల్లును అడ్డుకోవద్దని సూచన చేశారుకేంద్రమంత్రి బండి సంజయ్.. దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ అమలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. సింపుల్ గా చెప్పాలంటే చరిత్రలో సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇదేనని అన్నారు మంత్రి. ప్రజాస్వామ్యం మీద మీకు విశ్వాసం ఉంటే కచ్చితంగా సర్వేలో పాల్గొనాలని అన్నారు.రాజకీయ విమర్శల కోసమే బీసీ, ముస్లింల మీద విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు, ముస్లింలో పేద ప్రజలు చాన్నాళ్ల నుంచి బీసీల్లో ఉన్న విషయం మీకు తెలీదుగా అంటూ ప్రశ్నించారు మంత్రి పొన్నం. రేవంత్ సర్కార్ గడువు ఇచ్చిన నేపథ్యంలో విపక్షాలకు చెందిన కీలక నేతలు ఈ సర్వేలో పాల్గొంటారా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం నిర్ణయంపై కారు పార్టీ పెద్దల నుంచి ఎలాంటి సంకేతాలు వస్తాయో చూడాలి.

# బీఆర్ఎస్ పింక్ బుక్ రెడీ

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసుల గురించి తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్సీ కవిత .. కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. జనగాంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పింక్ బుక్ లో అన్ని రాసుకుంటున్నామని.. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చెల్లిస్తామన్నారు. లెక్కలు ఎలా రాయాలో మాకూ తెలుసు... మీ లెక్కలు తీస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతు డిక్లరేషన్ పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారు..పోస్టు చేసిన మరుసటి నాడే ఇంటికి పోలీసులు వచ్చి వేధిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ తిరుగుతారు... కానీ తెలంగాణ రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తారని .. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసం అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో గ్రామాల్లో నీళ్లు పారాయి.. నిధులు పారాయని గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి భయపడి 2001 లో ఆఘమేఘాలపై దేవాదుల ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారని.. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టు పనులను చేయించారన్నారు. 95 పూర్తయిన సమ్మక్క సారక్క బ్యారేజీ పనులను పూర్తి చేయలేని చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం అని కవిత విమర్శించారు. కేవలం 5 శాతం పనులను పూర్తి చేయలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని.. స్టేషన్ గణపూర్



ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. అవకాశవాదం కోసం కడియం శ్రీ హరి పార్టీ మారారని.. కడియం శ్రీహరిని ప్రజలు క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. న్యాయ వ్యవస్థపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ కు అనుకూలమైన తీర్పు వస్తుందన్న నమ్మకముందని.. ఉప ఎన్నిక వస్తే అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తుందని ప్రకటించారు. రూ 2500 ఇవ్వకుండా, స్కూటీలు ఇవ్వకుండా ప్రభుత్వం మహిళలను వేధిస్తోందని.. కళ్యాణ లక్ష్మీ, కేసీఆర్ కిట్ లు మాయమయ్యాయన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మానవత్వం లేదని.. కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆడబిడ్డలను మోసం చేసిన మహమ్మారి కాంగ్రెస్ ప్రభుత్వం.. విదేశీ విద్యా స్కాలర్ షిప్ నిధులు కూడా విడుదల చేయని దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అబద్దాలను ప్రజల్లో ఎండగడుతామని.. తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రక్షించాల్సిన వారే చీడ పురుగుల్లా తయారయ్యారు

**మంగళగిరి :** ధన, మాన, ప్రాణాలను రక్షించాల్సినవారే చీడ పురుగుల్లా తయారయ్యారని . నాయకుడు మంచోడైతే సమాజానికి మంచి జరుగుతుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు అన్నారు గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద మహానుభావులు పుట్టిన నేలపై ఈ వల్లభనేని వంశీ పుట్టి ఈ నేలను అపవిత్రం చేశారన్నారు. గత10 సంవత్సరాల నుండి గన్నవరంలో మట్టిని అక్రమంగా తరలించారని, తెలుగుదేశం ప్రభుత్వం గన్నవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే వంశీ దాన్ని దుర్వినియోగం చేశారన్నారు. సభ్య సమాజం తల దించుకునేలా వంశీ ప్రవర్తన ఉంటుందని వంశీలో ఏం చూసి జగన్ పార్టీలోకి తీసుకున్నాడో తెలియదన్నారు. నేడు జగన్ ప్రతిపక్ష హోదాకు తగదని తిరస్కరించబడ్డాడని వంశీ దుర్మార్గాలకు అంతం పలకాలని కోరారు. చంద్రబాబు హోదా పోగొట్టడానికి రాజీ పడమంటే నేను రాజీ పడలేదు. నాకు క్యారెక్టర్ ముఖ్యమని చెప్పానని జగన్ ఇలాంటి విష సంస్కృతిని ప్రోత్సహిస్తారన్నారు. 2014లో 2019లో పోటీ చేసిన డాక్టర్ రామచంద్ర గానీ, నేను గానీ ఎప్పుడూ బూతులు మాట్లాడలేదు. బుట్టా రామచంద్ర గానీ నేను గానీ పోటీ చేసినప్పుడు ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు.
తనపై అనేక నిరాధార నిందలు మోపారని గన్నవరంలో 400 మంది వైసీపీ నాయకుల మీద కేసులు పెట్టించినా అన్నీ గాలికొదిలి వంశీని జగన్ పార్టీలోకి తీసుకున్నాడన్నారు. వైసీపీ లో అవమానాలు మోయలేక తాను పార్టీ మారానన్నారు. చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా తీసేయాలనే వంశీని జగన్ పార్టీలోకి తీసుకున్నాడని జగన్ కు రౌడీలంటే ఇష్టమని వల్లభనేని వంశీ కూడా ఒక రౌడీ కాబట్టి వంశీని జగన్ తన పార్టీలోకి చేర్చుకున్నాడన్నారు. వంశీ అక్రమ లే అవుట్లతో కామన్ సైట్లన్నీ అన్యాక్రాంతం చేశాడని విజయవాడ రూరల్ మండలం లో రోడ్లకు ఆనుకొని ఉన్న భూములను కార్పొరేషన్ లో లేకుండా చేశారని రూరల్ మండలంలో ఉన్న 9 గ్రామాల్లో ఒక్క లే అవుట్ లో కూడా కామన్ సైట్ వాడుకోలేని పరిస్థితి తీసుకొచ్చి అన్ని కబ్జాలు చేశారన్నారు. బ్రహ్మానంద చెరువు, పోలవరం మట్టిని అమ్ముకున్న పాపం ఊరికే పోదని అది శాపంలా వెంటాడుతుందని వంశీకి నేను పలుమార్లు చెప్పానని పోలవరం మట్టిని తవ్వడం వల్లనే అంబాపురం వద్ద ఇటీవల బుడమేరు పొంగి విజయవాడను ముంచాయన్నారు.

## ప్రీ పబ్లిక్ పరీక్షలకు ఓఎంఆర్ షీట్లు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. అదేంటంటే.. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను కొత్తగా చేర్చనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు.విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది.ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది

## చిరు పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

**హైదరాబాద్ :** పరిశ్రమలు స్థాపించి పలువురికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో తపిస్తున్న వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తున్నట్లు జాతీయ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ స్వరూప అన్నారు. యూసఫ్ గూడా లోని ఎం ఎస్ ఎం ఈ లో పి ఎల్ బి అవుట్ రిచ్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వరూప హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పద్ధతిలో మానవాళికి అవసరమైన ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు వచ్చి శిక్షణ పూర్తి చేసుకున్న యువ పారిశ్రామి వ్యక్తులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనమని అన్నారు. తమ సంస్థ సీఈవో అశోక్ చంద్ర ప్రోత్సాహంతో సుమారు 600 కోట్ల మేరా రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. కేవలం ఎమ్మా లోనే 100 కోట్ల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక తోడ్పాటు నందించి వారి అభివృద్ధిలో భాగం కావాలన్నదే తమ బ్యాంకు లక్ష్యమని చెప్పారు.

## న్యాయమూర్తిపై చెప్పులు విసిరిన నిందితుడు

## చితకబాదిన న్యాయవాదులు

రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా తొమ్మిదవ అదనపు న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఖరం సింగ్ అనే వ్యక్తి నీ కోర్టు ఆవరణలోనే న్యాయవాదులు చితకబాదారు. జగదిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్మ్స్ ఆక్ట్ కేసులో శిక్ష పడటం తో న్యాయమూర్తిపై కోపం పెంచుకుని ఖర0 సింగ్ కోర్టు హాల్ లోని దాడికి దిగాడు. న్యాయమూర్తి పై దాడికి దిగటం తో పోలీసులు నిందితున్ని అక్కడ నుండి తీసుకుని వెళ్లి ప్రయత్నం చేయటం తో న్యాయవాదులు అడ్డుకుని ఆందోళన చేశారు. పోలీస్ లకి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

## రోడ్డు ప్రమాదంలో మైనర్ బాలిక మృతి

## సీసీ ఫూటేజ్ విడుదల చేసిన పోలీసులు

**రంగారెడ్డి :** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్ మెట్రో సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి సీసీటీవీ వీడియోలను విడుదల చేశారు పోలీసులు. మమత బైక్ పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతోనే మృతి చెందిందని కూకట్ పల్లి ఏసిపి శ్రీనివాసరావు వెల్లడించారు. మమత ఉద్యోగం చేస్తున్న కార్యాలయానికి సంబంధించిన యజమాని మైనర్ బాలికలకు మద్యం అలవాటు చేసి కార్లలో తిప్పుతున్న వీడియోలు వైరల్ గా మారడంతో దీనిపైన పోలీసులు స్పందించారు. వాటి పైన కూడా సమగ్ర విచారణ జరిపించి నిర్ధారణ అయితే ఓనర్ పైన చర్యలు చేపడతామని ఏసిపి తెలియజేశారు. మమత మృతి పైన తమకు అనుమానాలు ఉన్నాయని ఇప్పటికే తల్లి ఆరోపించింది. ఈ ఘటన పైన బీజేపీ, జనసేన పార్టీ నేతలు కుటుంబాన్ని పరామర్శించి సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు సైతం డిమాండ్ చేశారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

**చాగలమర్రి :** చాగలమర్రి లోని కూలూరు రస్తాలో ఉన్న వ్యవసాయ బావిలో పడి బాలు అలియాస్ అబ్దుల్లా (34) అనే వ్యక్తి మరణించాడు. అబ్దుల్లా స్థానిక విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా భార్య తనతో గొడవ పడి పుట్టింటికి వెళ్లి కాపురానికి తిరిగి రాలేదని మనస్థాపానికి గురైనాడు. బుధవారం మధ్యాహ్నం మోటార్ సైకిల్ లో కూలూరు రస్తా లోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి మద్యాన్ని సేవించి జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న చాగలమరి ఏ ఎస్ ఐ నబీరసుల్ తన సిబ్బందితో బావి వద్దకు చేరుకొని బావిలో పడ్డ అబ్దుల్లాను బయటకు తీయడం జరిగింది. బావిలో పడి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకొని బోరు న విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కళ్ళు మండుతున్నాయి...!

## ఊపిరి ఆడడం లేదు...!

**భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి ఉపరితల గనుల బొగ్గుచూర, బి టి పి ఎస్ బూడిద వలన మణుగూరు మండలంలో గాలి విపరీతంగా కాలుష్యమైంది వాతావరణంలో కాలుష్యం విస్తృతంగా ఆవరించింది విపరీతమైన కాలుష్యం వలన వృద్ధులకు పిల్లలకు అనారోగ్యంతో బాధపడుతున్నారు వారికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగింది తీవ్ర కాలుష్యం కారణంగా కళ్ళు మండుతున్నాయి విపరీతంగా పొగ కారణంగా ప్రజలకు ఊపిరావడం లేదు. మణుగూరు ఉపరితల గనుల నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ రోజుకు 16,000 టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నారు. మల్లె పెల్లి ఓసి నుండి బిటి పి ఎస్ రహదారులు వెంబడి నిత్యం 261 బొగ్గు లారీలు విపరీతమైన వేగంతో బిటి పి ఎస్ వారికి లారీలు నడుపుతూ దుమ్ము ధూళితో వెనక వచ్చే వాహనదారులకు కనపడక యాక్సిడెంట్లు అవుతున్నాయి. బొగ్గుచూర దుమ్ము గాలి లో కలుస్తుంది ప్రధాన రహదారి ఇరువైపు ల ఉన్న పచ్చని చెట్లు నల్లగా మారిపోయాయి పచ్చదనం లేక పకృతి విలవిల ఆడుతుంది సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10:00 వరకు విపరీతమైన దుమ్ము బొగ్గుచూర గాలిలో కలుస్తుంది వాతావరణం లో కలవడం వలన సాయంత్రం వేళలో ఆ రహదారిపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు ఆయా ప్రాంతాల ప్రజలకు ఊపిరాడకుండా అవుతుంది దట్టంగా గాలిలో ఉన్న కాలుష్యం కారణంగా ఎదుటి గా వచ్చే వాహనం కూడా కనిపించడం లేదు దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రధానంగా గాంధీనగర్ కాళీమాత ఏరియా భగత్ సింగ్ నగర్ శేషగిరి నగర్ రాజుపేట బాపన కుంట తదితర ప్రాంతాలలో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు



# గులాబీ ప్రేమకు మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా..!

గులాబీ పువ్వులు ప్రేమకు చిహ్నంగా అందరికీ తెలుసు. కానీ వీటిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. గులాబీ పువ్వుల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. వీటిని ఉపయోగించడం వల్ల చర్మపు మచ్చలు, బరువు తగ్గడం, మొటిమలు, ఇన్ఫెక్షన్లు, అలెర్జీ వంటి సమస్యలు తగ్గుతాయి. గులాబీ పువ్వులు ప్రేమకు మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిలో విటమిన్ ఎ, సి, ఇ, ఐరన్, కాల్షియం ఉన్నాయి. గులాబీ పువ్వుల రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. మొటిమల నివారణకు, జీర్ణక్రియ మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుంది. ఇలా ఆరోగ్య రీత్యా, చర్మ సంరక్షణలో గులాబీ పువ్వులు అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తాయి. చాలా మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. బరువు తగ్గడానికి గులాబీ పువ్వులు సహాయపడతాయి. 10 నుంచి 15 గులాబీ రేకులను నీటిలో వేసి నానబెట్టండి. నీరు గులాబీ రంగులోకి మారినప్పుడు దానికి ఒక చెంచా తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడి వేసి బాగా కలపండి. ఈ నీటిని నెల రోజుల పాటు తాగడం వల్ల బరువు తగ్గుతారు. గులాబీ పువ్వు మొటిమలను తగ్గించడంలో బాగా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గిస్తాయి. కొన్ని మెంతుల్ని వేయించి, రోజ్ వాటర్ కలిపి పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఈ పేస్ట్‌ని ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తర్వాత కడుక్కోండి. వారానికి రెండు సార్లు ఇలా చేయడం వల్ల మొటిమలు తగ్గుతాయి. గులాబీ రేకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఇది చాలా మంచిది. గులాబీ రేకులు పేగుల కదలికలను వేగవంతం చేస్తాయి. కడుపు నొప్పి, గ్యాస్, ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. గులాబీ రేకుల్ని శుభ్రపరిచి నేరుగా తినవచ్చు. నీటిలో నానబెట్టి, తేనె, దాల్చిన చెక్క పొడి వేసి తాగొచ్చు.

గులాబీ పువ్వులు ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తాయి. గులాబీ రేకుల్ని నీటిలో మరిగించి, ఆవిరిని పీల్చడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. రోజ్ వాటర్‌ను నాభికి అప్లై చేయడం వల్ల ముఖంపై ముడతలు తగ్గుతాయి. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఏజింగ్ లక్షణాలు ఉంటాయి. రోజ్ వాటర్ ముడతలను తగ్గించడంలో సహాయపడుతుంది. గులాబీ పువ్వులు కేవలం ప్రేమకు మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిని సరైన పద్ధతిలో ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు.

## గుడ్లు తినడం ఆరోగ్యానికి మంచిదేనా?




గుడ్లు పోషకాలతో నిండిన ఆహారం.. కానీ కొలెస్ట్రాల్ గురించి చాలామందికి భయం ఉంటుంది. అందుకే గుడ్లు తినడం మంచిదా కాదా అని చాలామందికి సందేహం ఉంటుంది. కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య నిపుణులు గుడ్ల గురించి వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే 48 సంవత్సరాల పాటు సాగిన ఒక అధ్యయనం ఇప్పుడు మనకు దీని గురించి సమాధానం ఇస్తుంది. 1968లో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుడ్లు తినడం తగ్గించాలని చెప్పింది. ఎందుకంటే వాటిలో కొలెస్ట్రాల్ ఎక్కువని అనుకున్నారు. ఈ సలహాను చాలా మంది పాటించారు. 2015లో ఈ సలహాను మార్చారు. ఈ అధ్యయనంలో గుడ్లు తినడం కాలానుగుణంగా మారుతూ వచ్చిందని తేలింది. 1970లలో వారానికి సగటున 3.6 గుడ్లు తినేవారు. 1990లలో అది 1.8కి పడిపోయింది. 2021లో మళ్ళీ 3.5కి పెరిగింది. ఆహారపు అలవాట్లు కాలానుగుణంగా మారుతున్న సూచనల వల్ల మారుతాయని, వ్యక్తిగత ఆరోగ్య అవసరాల వల్ల కాదని ఇది చూపిస్తుంది. గుడ్లు తినడం తగ్గించడానికి కొలెస్ట్రాల్ ఒక పెద్ద కారణం. గుడ్లు తింటే రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతుందని గుండె జబ్బులు వస్తాయని చాలామంది అనుకునేవారు. కానీ గుడ్లలోని కొలెస్ట్రాల్ చాలా మందికి రక్తంలో కొలెస్ట్రాల్‌ను పెంచదని ఇప్పుడు చెప్తున్నారు. నిజానికి 2021 నాటికి, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు కూడా గతంలో కంటే గుడ్లు తినడం తగ్గించలేదు. గుడ్లు అధిక కొలెస్ట్రాల్ మధ్య సంబంధం అతిగా చెప్పబడిందని ఇది సూచిస్తుంది. గుడ్లలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, లుటీన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటికి చాలా మంచివి. గుడ్లలో కొవ్వు తక్కువగా ఉంటుంది. అందుకే ఇవి ఆరోగ్యకరమైన ఆహారం. గుడ్లు చౌకగా కూడా దొరుకుతాయి. కండరాల బలం కోసం ఎక్కువ ప్రోటీన్ అవసరమయ్యే వృద్ధులకు ఇది చాలా మంచిది. కొలెస్ట్రాల్ ఆంక్షలు 2015లో తొలగించినప్పటికీ చాలా మంది ఇప్పటికీ గుడ్లు అనారోగ్యకరమైనవని నమ్ముతారు. అధ్యయనం ప్రకారం 22 శాతం మంది పాత సమాచారం కారణంగా గుడ్లు తినడం తగ్గించారు. కొంతమంది డాక్టర్లు చెప్పిన పాత సలహా ప్రకారం గుడ్లు తినలేదు. మరికొందరు గుడ్లలో కొలెస్ట్రాల్ ఉందని వాటిని హానికరమైనవిగా భావించారు. దీనికి కారణం ప్రజలకు సరైన సమాచారం లేకపోవడం.. పోషకాహారం గురించి అవగాహన లేకపోవడం.

# ఇలాంటి అలవాట్లు ఉన్నాయా?



గుండె రక్తాన్ని పంప్ చేయడానికి, అవయవాలకు ఆక్సిజన్‌ను అందించడానికి, శక్తిని నిర్వహించడానికి సహాయపడుతుంది. అందువల్ల, గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం మొత్తం ఆరోగ్యానికి ముఖ్యం.. మీ ఉదయం దినచర్య గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అయితే.. గుండె సంరక్షణ కోసం ఎలాంటి అలవాట్లను వదిలేయాలి..? ప్రస్తుత కాలంలో గుండె జబ్బుల కేసులు భారీగా పెరుగుతున్నాయి.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ గుండె జబ్బులతోపాటు గుండె పోటు బారిన పడుతున్నాయి.. ఇలా పరిస్థితుల్లో గుండె ఆరోగ్యంగా ఉండేందు మనం ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలి. వాస్తవానికి మన శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో గుండె ఒకటి. ఇది శరీరమంతా రక్తాన్ని పంప్ చేస్తుంది. కానీ నేటి కాలంలో చాలా మందికి గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయి. దీనికి కారణం మన చెడు జీవనశైలి.. వృద్ధులతో పాటు యువతలో కూడా గుండెపోటు ప్రమాదం పెరుగుతోంది. అటువంటి పరిస్థితిలో.. ఎలాంటి రోజువారీ తప్పులు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయో తెలుసుకోవడం ముఖ్యం.. గుండె సంబంధిత సమస్యలు నివారించేందుకు ఎలాంటి చెడు అలవాట్లను వదిలియాలి..? గుండె సంరక్షణ కోసం నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకోండి.. గురుగ్రామ్‌లోని మారింగో ఆసియా హాస్పిటల్ కార్డియాలజీ విభాగం చైర్మన్ డాక్టర్ సంజీవ్ చౌదరి గుండె సంబంధిత సమస్యల గురించి పలు విషయాలను పంచుకున్నారు. చాలా సార్లు మన తప్పుడు అలవాట్లు గుండెను బలహీనపరుస్తాయన్నారు. చెడు జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, అధిక చక్కెర ఆహారం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయన్నారు. రోజూవారి జీవితంలో ఎలాంటి అలవాట్లను మార్చుకోవాలి..? గుండె కార్డియాలజీ విభాగం నిపుణులు ఏం చెబుతున్నారు.. ఎలాంటి సూచనలు ఇస్తున్నారు..? ఇలాంటి విషయాలను తెలుసుకోండి. సిగరెట్లు, బీడీలు గుండెకు చాలా హానికరం. సిగరెట్ పొగ కూడా మీ గుండెకు హాని కలిగిస్తుంది. ధూమపానం రక్తాన్ని చిక్కగా చేస్తుంది. దీని కారణంగా, ధమనులలో రక్తం గడ్డకట్టడం ప్రారంభమవుతుంది.. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. మీరు మీ గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలనుకుంటే, వెంటనే ధూమపానం మానేయండి.


## వీటిని రోజుకొక్కటి తీసుకుంటే చాలు!



ముఖం చంద్రబింబంలా ప్రకాశించాలంటే దంత సిరి ప్రధాన పాత్ర పోషిస్తుంది. సరైన పలువరుస మీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. అయితే దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఖరీదైన వైద్యం చేయించుకోనక్కర్లేదు. బదులుగా సింపుల్‌గా ఇంట్లో దొరికే పండ్లు తిన్నా సరిపోతుందని అంటున్నారు నిపుణులు. నోట్లోని పళ్లు మన శారీరక ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. మంచి ఆహారం మనస్సును రంజింప చేస్తుంది. నోటికి రుచిని ఇవ్వడం ద్వారా మనల్ని ఆనందపరుస్తుంది. మీ దినచర్యలో కొన్ని ఆహారాలను చేర్చుకోవడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు నోటి ఆరోగ్యం కూడా గణనీయంగా మెరుగుపడుతుంది. ముఖ్యంగా మంచి దంత సంపదకు రోజుకు ఒక యాపిల్ తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అందుకే యాపిల్‌ను సహజ టూత్ బ్రష్ అని అంటారు. ఎందుకంటే ఇది టూత్ బ్రష్ లాగానే ప్రభావవంతంగా ఉంటుంది. ఇది దంతక్షయం కలిగించే బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడుతుంది. లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. నోటిని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. స్ట్రాబెర్రీలు కూడా దంత ఆరోగ్యానికి మంచివి. అరటిపండ్లు పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్ వంటి ముఖ్యమైన ఖనిజాలతో నిండి ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి, దంతాలకు మేలు చేస్తాయి. భోజనం తర్వాత ఇంట్లో తయారుచేసిన పుదీనా గ్రీన్ టీ తాగడం వల్ల నోటి పరిశుభ్రత, తాజా శ్వాస, నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. చిలగడదుంపలలో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. పంటి ఎనామిల్‌ను రక్షిస్తుంది. ఇది దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆకుకూరలు, ముఖ్యంగా పాలకూర, విటమిన్లు ఇూ, దీ2, దీ12 లతో నిండి ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన చిగుళ్ళు, దంతాలకు దోహదం చేస్తాయి. ఈ ఆహారాలతో పాటు, నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని శీతాకాల సంరక్షణ చిట్కాలను పాటించడం చాలా అవసరం. మీ దంతాలకు చల్లని గాలి తగలకుండా చూసుకోవాలి. తీవ్రమైన చలిలో బయటకు వెళ్ళేటప్పుడు, మీ దంతాలను రక్షించడానికి, వెచ్చదనం, తేమను అందించడానికి,మీ నోరు ఎండిపోకుండా నిరోధించడానికి మౌత్ గార్డ్ ధరించడం మంచిది. ఇది లాలాజలాన్ని తగ్గిస్తుంది. దంతక్షయం ప్రమాదాన్ని పెంచుతుంది.

# పరీక్షల సమయంలో విద్యార్థులకు నో టెన్షన్!

పరీక్షలు దగ్గర పడుతున్నాయంటే చాలు విద్యార్థులకు ఒత్తిడి ఎక్కువవుతుంది. పరీక్షల సమయం విద్యార్థులకు చాలా కష్టమైన సమయం. చాలా మంది పిల్లలు సంవత్సరం అంతా చదవనంత ఎక్కువగా పరీక్షలప్పుడు చదువుతారు. ఈ సమయంలో చాలా మంది పిల్లలు ఆందోళనగా, ఒత్తిడితో, భయంగా ఉంటారు. పరీక్షల ఒత్తిడి కొంతమంది పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఏకాగ్రతను మెరుగుపరచడానికి సమతుల్య ఆహారం చాలా అవసరం. మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం కూడా బాగుంటుంది. పరీక్షల ఒత్తిడిని తగ్గించుకొని ప్రశాంతంగా చదవడానికి ఉపయోగపడే కొన్ని చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. పిల్లలకు మాత్రమే కాదు ఆహారం తీసుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల మానసిక సామర్థ్యంపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుందని డైటీషియన్ చెబుతున్నారు. ఉదాహరణకు ఐరన్ లోపం డోపమైన్ ప్రసరణకు అంతరాయం కలిగిస్తుంది. ఇది వారి తెలివితేటలపై ప్రభావం చూపుతుంది. విటమిన్ ఇ, థయామిన్, విటమిన్ బి, జింక్, అయోడిన్ వంటి అనేక ఖనిజాలు, విటమిన్లు పిల్లల జ్ఞాన సామర్థ్యాన్ని, మానసిక దృష్టిని మెరుగుపరుస్తాయని తేలింది. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి చదువుపై దృష్టి పెట్టడానికి నిపుణులు చెప్పిన కొన్ని ఆహార చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. అన్ని కార్బోహైడ్రేట్స్ చెడ్డవి కావు మీ ఆహారంలో ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్స్ చేర్చండి. వీటిలో తృణధాన్యాల రొట్టె, బ్రౌన్ రైస్, క్వినోవా, గోధుమలు వంటివి తీసుకోండి. వీటిలో గ్లూకోజ్ ఎక్కువగా ఉంటుంది అని నిపుణులు చెప్తున్నారు. చిలగడదుంపలు, గుమ్మడికాయ వంటివి కూడా కార్బోహైడ్రేట్స్‌కు ఉదాహరణలు. అయితే ప్రతిదీ మితంగా తినాలి. ఎక్కువ తినకూడదు. కూరగాయల శక్తిని తక్కువ అంచనా వేయకండి. కూరగాయలలో అనేక పోషకాలు ఉంటాయి. అవి మీకు చాలా విధాలుగా ఉపయోగపడతాయి. కాబట్టి పిల్లలు అన్ని రకాల కూరగాయలు తినాలని డైటీషియన్ సూచిస్తున్నారు. కానీ పిండి లేని కూరగాయలు ఎక్కువగా తినాలి. బంగాళాదుంపలు తినడం తగ్గించాలి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, ఏకాగ్రతకు సహాయపడతాయని మీకు తెలుసా..? పిల్లలు వారానికి కనీసం రెండుసార్లు ఒమేగా-3 ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. సీఫుడ్, చేపలలో ఒమేగా-3లు ఎక్కువగా ఉంటాయి. చేపలు, చికెన్, ట్యూనా, టర్కీ, లీన్ రెడ్ మీట్ వంటి లీన్ ఫుడ్స్ పిల్లల ఆహారంలో ఉండాలి అని నిపుణులు



అంటున్నారు. పెరుగు మీ పేగులను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది అని డైటీషియన్ వివరిస్తున్నారు. పరీక్షల సమయంలో కడుపు సంబంధిత సమస్యలు రాకుండా ఉండటానికి పేగు ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడే ఆహారాలు తినడం చాలా ముఖ్యం. పెరుగు ప్రోబయోటిక్. ఇది కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. సెరోటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. పరీక్షలకు ముందు పెరుగు- చక్కెర తినడం మానేయవద్దని డైటీషియన్ సూచిస్తున్నారు.

## బిజినెస్

# మార్కెట్లోకి కొత్త రూ.50 నోట్లు

## పారిశ్రామికోత్పత్తి పడక తయారీ రంగం వెలవెల



దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారుకోవడంతో తయారీ రంగం వెలవెల పోతోంది. సరుకులకు డిమాండ్ తగ్గడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) నాలుగు నెలల కనిష్టానికి పడిపోయినట్లు స్వయంగా ప్రభుత్వ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. గడిచిన ఏడాది 2024 డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 3.2 శాతానికి పడిపోయిందని బుధవారం కేంద్ర గణంకాల శాఖ తెలిపింది. ఇంతక్రితం నవంబర్‌లో 5 శాతంగా నమోదయ్యింది. ఇదే నెలలో తయారీ రంగంలో 5.8 శాతం పెరుగుదల ఉండగా.. డిసెంబర్‌లో 3 శాతానికి పరిమితమవడం ఆందోళనకరం. నవంబర్‌లో 1.9 శాతం పెరిగిన గనుల రంగం.. డిసెంబర్‌లో 2.6 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్ ఉత్పత్తి 4.4 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగింది. మౌలిక వసతులు, నిర్మాణ రంగ ఉత్పత్తులు నవంబర్‌లో 8.1 శాతం వృద్ధిని సాధించగా.. డిసెంబర్‌లో 6.3 శాతానికి తగ్గాయి. జనవరికి సంబంధించిన ఐఐపి గణంకాలను మార్చ్ 12న విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.31 శాతంగా చోటు చేసుకుంది. 2024 డిసెంబర్‌లో ఇది 5.22 శాతంగా చోటు చేసుకుంది. గడిచిన నెలలో అహారోత్పత్తుల ధరలు 6 శాతంగా ఉండగా.. ఇంతక్రితం నెలలో 8.4 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. జనవరిలో ముఖ్యంగా కొబ్బరి ఆయిల్ 54.2 శాతం, ఆలు 49.6 శాతం, కొబ్బరి 38.7 శాతం, అల్లం 30.7 శాతం, బటానీలు 30.2 శాతం చొప్పున పెరగడం గమనార్హం.

### ఆరో రోజూ నష్టాల పరంపర

వరుసగా ఆరో సెషన్‌లోనూ భారత స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భయాలు, ఎఫ్ఐఐలు తరలిపోవడం, భారత జిడిపి వృద్ధిపై అనుమానాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ఇంట్రాడేలో బిఎస్ఇ సెన్సెక్స్ ఏకంగా 905 పాయింట్లు పతనమై 76వేల దిగువకు పడిపోయి 75,388 కనిష్టాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత కొంత కొనుగోళ్లు పుంజుకున్నప్పటికీ.. తుదకు 122.52 పాయింట్ల నష్టంతో 76,171 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 26 పాయింట్లు కోల్పోయి 23,045కు చేరింది. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు లేదా 3.07 శాతం, నిఫ్టీ 694 పాయింట్లు 2.92 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటిసి, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండిస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టర్బో, అల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్ తదితర షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మంగళవారం నాటికి రూ. 4,486.41 కోట్ల విలువైన ఎఫ్ఐఐలు తరలిపోయాయి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిగ్ అప్డేట్ ఇచ్చింది. కరెన్సీ నోట్ల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలోనే మార్కెట్లోకి కొత్త రూ. 50 నోటును తీసుకురానున్నట్టు ఆర్బీఐ ప్రకటించింది. అలాగే ప్రస్తుతం చెలామణిలో ఉన్న నోట్ల విషయంలోనూ కీలక ప్రకటన చేసింది. రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ శక్తి కాంత దాస్ స్థానంలో ఇటీవల ఆర్బీఐ గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్ లోనే ఆయన గవర్నర్ బాధ్యతలను చేపట్టారు. ఈ క్రమంలో మహాత్మా గాంధీ సిరీస్ లో కొత్త రూ.50 నోటును మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ప్రకటించింది ఆర్బీఐ. ఇప్పుడున్న నోట్లపై మాజీ గవర్నర్ సంతకం ముద్రించి ఉంది. కొత్త నోట్లపై ప్రస్తుతం గవర్నర్ సంతకంతో వీటిని విడుదల చేసేందుకు సిద్ధమైంది. కొత్తగా ప్రింట్ చేయనున్న రూ. 50 నోటు మహాత్మా గాంధీ సిరీస్ లో భాగంగానే డిజైన్ ఉండనుంది అని ఆర్బీఐ తన ప్రకటనలో తెలిపింది. అదే విధంగా పాత నోట్ల విషయంలోనూ కీలక ప్రకటన చేసింది. కొత్త నోట్లు రానున్న వేళ పాత 50 రూపాయల నోటును వెనక్కి తీసుకుంటారా? అనే విషయంపైనా స్పష్టత ఇచ్చింది. పాత నోట్ల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త నోట్లు విడుదల చేసినప్పటకీ ప్రస్తుతం ఉన్న నోట్లు కూడా మార్కెట్లో చెలామణీలోనే ఉంటాయని ఆర్బీఐ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే పుకార్లకు చెక్ పెట్టేలా ఆర్బీఐ పూర్తి క్లారిటీ ఇచ్చింది. ఆర్బీఐ అందించిన సమాచారం ప్రకారం కొత్త యాబై రూపాయల నోటు మహాత్మాగాంధీ (కొత్త) సిరీస్ లోనే విడుదల చేయనున్నారు. దీనిని ఫ్లోర్ సెంట్ నీలం రంగులో



డిజైన్ చేయనున్నట్టు తెలుస్తోంది. నోటు వెనుక భాగంలో రథంతోఉన్న హంపి చిత్రంతో దేశ సాంస్కఈతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. ఈ నోటు పరిమాణం 66 మి.మీ %ఇ% 135 మి.మీ ఉండనుందట. మాజీ గవర్నర్ శక్తికాంతదాస్ స్థానంలో సంజయ్ మల్హోత్రాను 2022లో కేంద్ర ప్రభుత్వం ఆర్బీఐ గవర్నర్ గా నామినేట్ చేసింది. ఆయన గతంలో ఆర్థిక సేవల విభాగంలో కార్యదర్శిగా పనిచేశారు. 1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్ కు చెందిన సంజయ్ మల్హోత్రా సీనియర్ అధికారిగా ఉన్నారు. కొంతకాలం పాటు ఇంధన మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శి బాధ్యతల్లో కూడా పనిచేశారు. ఆర్బీఐ గవర్నర్‌గా నియమితులైన తర్వాత తన మొదటి ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో.. 6.5 శాతం నుండి 6.25 శాతానికి 25 బేసిస్ పాయింట్ల రేటు తగ్గింపును మల్హోత్రా ప్రకటించారు. 12 పాలసీల తర్వాత ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ రెపో రేటును తగ్గించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

# బంగారంపై రుణాలు.. కేంద్రం కొత్త నిబంధనలు

బంగారం తాకట్టు విషయంలో కేంద్రం తాజా హెచ్చరికలు చేసింది. కొందరు తమ అవసరం కోసం బ్యాంకులు, పాన్ షాపుల్లో తమ బంగారాన్ని తాకట్టు పెడుతుంటారు. అయితే, వారు తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించలేని పక్షంలో ఆ బంగారాన్ని వేలం వేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశాలు కీలకంగా మారాయి. గోల్డ్ లోన్ చెల్లించలేని కారణంగా బ్యాంకులు ఇష్టారీతిన ప్రజల సొమ్మును వేలం వేయడానికి వీల్లేదని కేంద్రం ప్రకటన చేసింది. బంగారం వేలం వేసే విషయంలో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు నిబంధనలు కచ్చితంగా పాటిం చాలని హెచ్చరించింది. ఈ మేరకు లోక్ సభలో ప్రకటన చేశారు. కమర్షియల్ బ్యాంకులు సామాన్యుల సొమ్మును వేలం వేసే పక్షంలో కచ్చితంగా ఆర్బీఐ నిబంధనలను పాటించి తీరాలనే రూల్స్ ఉన్నాయి. అయితే, కొందరు సాధారణ పాన్ షాపుల్లో తమ బంగారాన్ని తాకట్టు పెడుతుంటారు. అయితే వీరు ఎలాంటి రూల్స్ పాటించరు. కస్టమర్లకు గడువు ముగిసిన తర్వాత ఎలాంటి హెచ్చరికలు లేకుండా వారి బంగారాన్ని వేలం వేసేస్తుంటారు. ఇకపై ఎవరైనా ఇలా చేస్తున్నట్టు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హెచ్చరించారు. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఒకేలాంటి నియమాలు పాటించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ బ్యాంకులు ఆర్బీఐ పరిధిలోకి రాకున్నప్పటికీ బిడ్డింగ్ విషయంలో వీరు కచ్చితంగా నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఇలా కస్టమర్లు తాకట్టు పెట్టిన బంగారం వేలం వేసే ముందు వారికి నోటీసులు పంపించాల్సి ఉంటుంది. ఆభరణాల సొమ్మును రుణ గ్రహీతలు తిరిగి చెల్లించడంలో విఫలమైతే బ్యాంకు లేదా ఎన్ ఎఫ్ బీసీ వేలానికి వెళ్లవలసి వస్తుంది. కానీ దానిని కస్టమర్ కు సరిగ్గా తెలియజేయాలి. ఈ ప్రక్రియలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.



లేదంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ఆర్థిక శాఖ చర్యలు తీసుకుంటుంది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఈ విషయంలో ఒకే విధమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుందని నిర్మలాసీతారామన్ గుర్తుచేశారు.

# క్రెడిట్ అతడికే ఇవ్వాలి.. నా స్థానంలో ఎవరున్నా జరిగేది అదే

ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో తాను అవుటైన తీరు పట్ల టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(%=శీష్ట్రఖ్ నాష్ఠుతీఝ%) స్పందించాడు. బౌలర్ అద్భుతమైన బంతిని సంధించాడని.. అది ఆడటం ఎవరితరం కాదంటూ తనను తాను సమర్థించుకున్నాడు. కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025(%×జజ జష్ఠుఎజూఅశీఅం ఎతీశీజూష్టం% 2025)కి ముందు భారత క్రికెట్ జట్టు అద్భుతమైన విజయం అందుకున్న విషయం తెలిసిందే. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను రోహిత్ సేన 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత నాగ్‌పూర్‌లో బట్లర్ బృందాన్ని నాలుగు వికెట్ల తేడాతో ఓడించిన టీమిండియా.. కటక్‌లో జరిగిన రెండో వన్డేలోనూ నాలుగు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఈ మ్యాచ్‌తో ఫామ్‌లోకి వచ్చిన భారత ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ.. విధ్వంసకర శతకం(119) బాది జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.



### మార్క్‌వుడ్ సూపర్ డెలివరీ



అయితే, అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో మాత్రం హిట్‌మ్యాన్ తేలిపోయాడు. రెండు బంతులు ఎదుర్కొని కేవలం ఒకే ఒక్క పరుగు చేసి పెవిలియన్ చేరాడు. ఇంగ్లండ్ పేసర్ మార్క్‌వుడ్ గంటకు దాదాపు 142 కిలోమీటర్ల వేగంతో సంధించిన బంతిని ఆడటం తప్ప రోహిత్ శర్మకు మరో ఆప్షన్ లేకపోయింది. ఈ క్రమంలో అవుట్‌సైడ్ ఎడ్జ్ తీసుకున్న బంతిని వికెట్ కీపర్ ఫిలిప్ సాల్ట్ తన కుడివైపునకు డైవ్ చేసి మరీ ఒడిసిపట్టాడు. దీంతో రోహిత్ నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. టాస్ ఓడిన టీమిండియా.. ఇలా ఆరంభంలోనే వికెట్ కోల్పోయినప్పటికీ భారీ స్కోరు చేయగలిగింది. ఓపెనర్ శుబ్‌మన్ గిల్(112) శతకంతో చెలరేగగా.. విరాట్ కోహ్లి(52), శ్రేయస్ అ?య్యర్(78), కేఎల్ రాహుల్(40) రాణించడం వల్ల నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్‌కు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. వీరి దెబ్బకు 34.2 ఓవర్లలో 214 పరుగులు చేసి బట్లర్ బృందం ఆలౌట్ అయింది. ఫలితంగా 142 పరుగుల తేడాతో గెలిచిన భారత్ సిరీస్‌ను సంపూర్ణ విజయంతో ముగించింది.

### క్రెడిట్ మొత్తం బౌలర్‌కే ఇవ్వాలి

ఈ నేపథ్యంలో విజయానంతరం రోహిత్ శర్మ మాట్లాడుతూ.. "ఈ సిరీస్ సాగిన తీరుపట్ల ఎంతో సంతోషంగా ఉంది. సవాళ్లు ఉంటాయని ముందే తెలుసు. ఊహించనవి కూడా జరగడం సహజమే. నా విషయంలో క్రెడిట్ మొత్తం బౌలర్‌కే ఇవ్వాలి. బౌలర్‌గా నన్ను సవాల్ చేయడం అతడి కర్తవ్యం. బ్యాటర్‌గా బౌలర్‌ను ఎదుర్కోవడం నా పని. ఇక్కడ ఇద్దరం ఒకరితో ఒకరం పోటీ పడే క్రమంలో నేను ఆ బంతిని ఆడటంలో విఫలమయ్యాను. ఆ విషయం పక్కనపెడితే.. ఈ సిరీస్‌లో మా జట్టు ఆడిన తీరు పట్ల సంతృప్తిగా ఉన్నాను. అయితే, కొన్ని విషయాల్లో మాత్రం మా ఆట తీరును మెరుగుపరచుకోవాల్సి ఉంది.

### చాంపియన్ టీమ్

వాటి గురించి నేను ఇక్కడ వివరణ ఇస్తూ ఉండలేను. అయితే, జట్టుగా నిలకడైన ప్రదర్శన చేయడం పట్ల మాకు ఒక స్పష్టమైన అవగాహన ఉంది. చాంపియన్ టీమ్ రోజురోజుకూ మరింత మెరుగవ్వాలని ఆశించడం సహజమే కదా! మేమూ అంతే.. తమకు నచ్చిన విధంగా ఆడేలా మా ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం. అందుకు వరల్డ్‌కప్(2023) చక్కటి ఉదాహరణ. అయితే, నాడు అనుకున్న ఫలితాన్ని రాబట్టలేకపోయాం. ఆటలో ఇవన్నీ భాగమే" అని చెప్పుకొచ్చాడు. కాగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో పరిపూర్ణ విజయం సాధించిన టీమిండియా తదుపరి చాంపియన్స్ ట్రోఫీ బరిలో దిగనుంది.

### తదుపరి ఐసీసీ టోర్నీలో

పాకిస్తాన్ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి ఈ ఐసీసీ టోర్నీ మొదలుకానుండగా.. ఫిబ్రవరి 20న దుబాయ్ వేదికగా రోహిత్ సేన తమ ప్రయాణం మొదలుపెట్టనుంది. లీగ్ దశలో తొలుత బంగ్లాదేశ్‌తో.. అనంతరం పాకిస్తాన్, న్యూజిలాండ్‌లతో మ్యాచ్‌లు ఆడనుంది. ఇక 2017లో చివరగా నిర్వహించిన ఈ వన్డే ఫార్మాట్ ఈవెంట్లో ఫైనల్ చేరిన టీమిండియా పాక్ జట్టు చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

## స్పోర్ట్స్

## ఆర్సీబీ కెప్టెన్‌గా రజత్ పాటిదార్.. కోహ్లి కామెంట్స్ వైరల్



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కొత్త కెప్టెన్ నియామకంపై ఆ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి స్పందించాడు. సారథిగా ఎంపికైన రజత్ పాటిదార్‌కు శుభాకాంక్షలు చెప్పిన ఈ రన్‌మెషీన్.. కెప్టెన్సీకి అతడు వందశాతం అర్హుడని ప్రశంసలు కురిపించాడు. అతడికి ఎల్లప్పుడూ తన మద్దతు ఉంటుందని ప్రకటించాడు. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 సీజన్‌కు గానూ ఆర్సీబీ టీమిండియా ఆటగాడు రజత్ పాటిదార్‌ను తమ కెప్టెన్‌గా నియమించింది. సౌతాఫ్రికా వెటరన్ స్టార్ ఫాఫ్ డుప్లెసిస్ స్థానంలో ఈ మధ్యప్రదేశ్ క్రికెటర్‌కు పగ్గాలు అప్పగించింది. కాగా 2021లో ఆర్సీబీలో చేరిన పాటిదార్‌ను 2022 వేలానికి ముందు ఫ్రాంఛైజీ విడిచిపెట్టింది.

### కెప్టెన్ స్థాయికి

ఈ క్రమంలో అతడు వేలంలో అమ్ముడుపోకుండా మిగిలిపోగా.. రీప్లేస్‌మెంట్ ఆటగాడిగా మళ్లీ జట్టులోకి చేర్చుకుంది. అయితే, తన అద్భుత ఆట తీరుతో అతడు ఇప్పుడు కెప్టెన్ స్థాయికి చేరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లి రజత్ పాటిదార్ గురించి తన అభిప్రాయాలు పంచుకున్నాడు. "ఆర్సీబీ కొత్త కెప్టెన్‌గా రజత్ పాటిదార్ ఎంపికయ్యాడు. నీకు శుభాభినందనలు రజత్. నిన్ను నువ్వు నిరూపించుకుని... ఫ్రాంఛైజీతో అనుబంధాన్ని పెంచుకుని.. ఇక్కడి దాకా వచ్చావు. ఆర్సీబీ అభిమానుల హృదయాల్లో చోటు సంపాదించావు. నీ ఎదుగుదల ఇక్కడితో ఆగిపోదు. కెప్టెన్‌గా నువ్వు అర్హుడివి. నాతో పాటు జట్టులోని సభ్యులంతా నీ వెన్నంటే ఉంటాము. నీ పాత్రను సమర్థవంతంగా పోషించేలా సహకారం అందిస్తాం. ఇదొక కీలకమైన బాధ్యత. గత కొన్నేళ్లుగా నేనూ, ఫాఫ్ సారథ్య బాధ్యతలను మోశాం. ఇప్పుడు నీకు ఆ గౌరవం దక్కింది. నువ్వు ఈ స్థాయికి చేరుకోవడం పట్ల నాకు సంతోషంగా ఉంది.

### ఇది నీ హక్కు

కెప్టెన్‌గా ఉండటం ఒక రకంగా నీకు నువ్వుగా సంపాదించుకున్న హక్కు. గత రెండేళ్ల నీ ప్రయాణం అద్భుతం. టీమిండియా తరఫున కూడా అరంగేట్రం చేశావు. మధ్యప్రదేశ్ జట్టును ముందుకు నడిపించిన తీరు కూడా నన్ను ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అద్భుతమైన ఫ్రాంఛైజీ జట్టుకు సారథిగా నిన్ను నువ్వు మరోసారి నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది. రజత్ పాటిదార్‌కు మద్దతుగా ఉండాలని అభిమానులకు కోరుతున్నా. ఏది ఏమైనా.. చివరకు మన అందరికీ జట్టు ప్రయోజనాలు, గెలుపే ముఖ్యం. జట్టుగా ఎదుగుదాం. మన అద్భుతమైన ఫ్రాంఛైజీకి చిరస్మరణీయ విజయాలు అందిద్దాం. రజత్‌కు మరోసారి శుభాకాంక్షలు. అభిమానుల ప్రేమ మనకు ఎల్లప్పుడూ లభిస్తుంది. రానున్న సీజన్‌లో ఆర్సీబీ సరికొత్తగా అద్భుతంగా సాగాలని ఆకాంక్షిస్తున్నా" అని మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా గతేడాది.. రజత్ పాటిదార్ దేశీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ జట్టును ఫైనల్‌కు చేర్చాడు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com